



# విజయభాను


44th వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, గురువారం 15-10-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 44 సంచిక : 32 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## సహాయక చర్యలు మరింత
# ముమ్మరం చేయండి

- అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్
- శిబిరాల్లో ఉన్న వారికి రూ.500 చొప్పున ఇవ్వండి
- వారు ఇళ్లకు తిరిగి వెళ్లాక ఇబ్బందులకు గురి కావొద్దు
- వెంటనే అన్ని చోట్ల విద్యుత్ సరఫరాను పునరుద్ధరించండి
- చెరువులు, కాల్వల గండ్లు పూడ్చండి

రోడ్లపై గుంతలు పూడ్చి, అవసరమైన మరమ్మతులు చేయండి - భారీ వర్షాలు-వరదలు, సహాయ కార్యక్రమాలపై సీఎం జగన్ సమీక్ష



తాడేపల్లి: ఎడతెరిపి లేని వర్షాలు, వరదలతో ఆంధ్రప్రదేశ్ తడిసిముద్దయింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కృష్ణా నదికి భారీగా వరద పోటెత్తుతోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారీ వర్షాలు, సహాయక చర్యలపై బుధవారం మధ్యాహ్నం సమీక్ష నిర్వహించారు. మంత్రులు సుచరిత, బొత్స, సీఎస్ నీలంసాహ్ని కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్లు,అధికారులతో జిల్లాలవారీగా సీఎం సమీక్షించారు.

ప్రభుత్వ యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. విద్యుత్ పునరుద్ధరణ యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సీఎం ఆదేశించారు. రోడ్ల పునరుద్ధరణ పనులు వేగంగా చేపట్టి వరద బాధితులకు సాయం చేయాలని అన్నారు. అదేసమయంలో వర్షాల వల్ల వచ్చే వ్యాధులపై దృష్టి పెట్టాలని సీఎం చెప్పారు. పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి అవసరమైన సాయం అందించాలని అన్నారు. తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టాలన్న సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు.

**ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష సమావేశంలోని ముఖ్యాంశాలు**

ప్రకాశం బ్యారేజీకి భారీ వరద: తెలంగాణలో భారీ వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజీకి భారీ వరద వస్తోంది. బ్యారేజీ వద్ద ఇప్పటికే భారీ వరద కొనసాగుతోంది. శ్రీశైలం

తరువాయి 2లో..

## నృత్యకారిణి డా.శోభానాయుడు
# ఇక లేరు



హైదరాబాద్: ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి పద్మశ్రీ డా.శోభానాయుడు(64) కన్నుమూశారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మంగళవారం అర్ధ రాత్రి 1:40కి తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె కొంతకాలంగా న్యూరో లాజికల్ సమస్యతో చికిత్స పొందుతున్నారు. విశాఖ జిల్లా అనకాపల్లిలో 1956లో శోభానాయుడు జన్మించారు. 12 ఏళ్ల వయసులో కూచిపూడిలో అరంగేట్రం చేశారు. వెంపటి చినసత్యం వద్ద శిష్యురాలిగా చేరారు. సత్యభామ, పద్మావతి పాత్రల్లో రాణించారు. హైదరాబాద్ కూచిపూడి ఆర్ట్ అకాడమీకి ఆమె ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. కూచిపూడి నృత్యంలో వందల మందికి శిక్షణనిచ్చారు. శోభానాయుడు 2001లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. 1998లో ఎన్టీఆర్, 1982లో నిత్య చూడామణి, 1991లో సంగీత నాటక అకాడమీ పురస్కారాలు అందుకున్నారు. యూకే, సిరియా, టర్కీ, హాంకాంగ్, మెక్సికో, వెనిజులా, క్యూబా తదితర దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చారు.

# 24 గంటలపాటు అప్రమత్తంగా ఉండాలి

## డీజీపీ గౌతం సవాంగ్



అమరావతి: ఏపీ వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పోలీసు శాఖ మరో 24 గంటలపాటు అప్రమత్తంగా ఉండాలని డీజీపీ గౌతం సవాంగ్ తెలిపారు. మరో రెండు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, వరద తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాలను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. ఈరోజు కురిసిన వర్షానికి ప్రజల ప్రాణాలు

తరువాయి 2లో..

# స్టార్స్ ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం



న్యూఢిల్లీ: స్ట్రెంథెనింగ్ టీచింగ్-లెర్నింగ్ అండ్ రిజల్ట్స్ ఫర్ స్టేట్స్ (STARS) ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అదేవిధంగా జమ్ముకశ్మీర్, లఢక్‌లకు సంబంధించిన ప్రత్యేక ప్యాకేజీకి, నగర్నార్ స్టీల్ ప్లాంట్ డీమెర్జర్‌కు కూడా కేబినెట్ ఆమోదముద్ర వేసింది. భారీ అంచనా వ్యయంతో కూడిన స్టార్స్ ప్రాజెక్టును ప్రపంచబ్యాంకు సహకారంతో అమల్లోకి తీసుకురానున్నట్లు కేబినెట్ భేటీ అనంతరం కేంద్రమంత్రి ప్రకాశ్‌జవదేకర్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తి అంచనా వ్యయం రూ.5,718 కోట్లు కాగా, ప్రపంచ బ్యాంకు 500 మిలియన్ అమెరిన్ డాలర్లను ఆర్థిక సాయంగా అందించనున్నదని

తరువాయి 2లో..

## ఏపీలో ఏడు పంప్డ్ స్టోరేజీ
# జల విద్యుత్ కేంద్రాలు

- డీపీఆర్ రూపకల్పనకు ఏడు కంపెనీలు టెండర్
- ఆర్థిక బిడ్ల ఖరారులో నెడ్‌క్యాప్
- సమగ్ర నివేదికల తర్వాత పనులు ప్రారంభం

అమరావతి : సంప్రదాయేతర, పునరుత్పాదక ఇంధన వనరుల విభాగం (నెడ్‌క్యాప్) రాష్ట్రంలో ఏడు ప్రాంతాల్లో పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. వీటి సామర్థ్యం 6,300 మెగావాట్లు. వీటి ఏర్పాటుకు సమగ్ర నివేదిక (డీపీఆర్) రూపొందించేందుకు నెడ్‌క్యాప్ టెండర్లు పిలిచింది. ఏడు కంపెనీలు సాంకేతిక బిడ్‌కు అర్హత సాధించాయి. త్వరలో ఆర్థిక బిడ్ తెరిచి టెండర్లు ఖరారు చేస్తామని, డీపీఆర్ ప్రక్రియ పూర్తయ్యాక

తరువాయి 2లో..

## భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు రాకుండా
# శాశ్వత ప్రాతిపదికన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి



**రాంబిల్లి మండలం, ముంపునకు గురైన ప్రాంతాలను సందర్శించిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు**

విశాఖపట్నం : వరదలలో నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం రాంబిల్లి మండలం రజాలలో ముంపునకు గురయిన ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపునకు గురయిన 7 గ్రామాల ప్రజలను ఆదుకుంటామని, వారికి పునరావాసం కల్పిస్తామని తెలిపారు. పంట నష్టంపై అధికారులు నివేదికలు సమర్పించిన వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని

తరువాయి 4లో..

## రోడ్డు మరమ్మతులు తదితర పనులను
# యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలి




## రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి

విశాఖపట్నం : అల్ప పీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ భారీ వర్షాలు వలన వచ్చే వరదలకు సంబంధించి దెబ్బతిన్న పంటలు, చెరువులకు గండ్లు, విద్యుత్ సరఫరా, రోడ్డు మరమ్మతులు తదితర పనులను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు. వీటికి సంబంధించిన నష్టాల ను అంచనా వేసి నివేదికలను వేగవంతంగా పంపాలన్నారు. ఇళ్ల డ్యామేజీ, ప్రాణ నష్టాల వివరాలను తెలియజేయడం తో పాటు బాధితులకు తక్షణమే పరిహారం అందజేయాలన్నారు.

సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని డయేరియా లాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున శానిటేషన్ మీద ప్రత్యేక ధ్యాస పెట్టాలన్నారు. త్రాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయడం, అవసరమైన మందులను అన్ని పీహెచ్సీలలో అందుబాటులో ఉంచాలన్నారు.

జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయిందన్నారు.46 మండలాల్లో 22 మండలాలు భారీ వర్షాలకు గురయ్యాయని, మిగిలిన మండలాల్లో పాక్షికంగా వర్షాలు పడ్డాయని అన్నారు.

జిల్లాలో ఐదుగురు మృతి చెందారని తెలిపారు. వరి,ఉద్యాన పంటలకు సంబంధించి అంత ఎక్కువ నష్టం జరగలేదన్నారు.

జీవీఎంసీ పరిధిలో ఒక రూఫ్ కూలి పోయిన ఘటనలో ఇద్దరు మృతిచెందారని,సంబంధిత కుటుంబీ కులకుపరిహారాన్ని అందజేయడం జరిగిందన్నారు. తొమ్మిది ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని వారికి ఈ రోజు సాయంత్రం నష్ట పరిహారాన్ని అందజేయడం జరుగతుందని తెలిపారు. జిల్లా లో కొన్ని చోట్ల పాక్షికంగా రోడ్లు దెబ్బ తిన్నాయనీ సిబ్బంది పనులను చేపడుతున్నారని తెలిపారు. జిల్లా లో 18 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగిందని వాటిలో 1120 మందినీ తరలించామన్నారు. జిల్లా లో ఎటువంటి పశు నష్టం లేదని, ఒక కోళ్ల పౌల్ట్రీ షెడ్ దెబ్బ తిందని తెలిపారు. ఇరిగేషన్ కు సంబంధించి తాండవ రిజర్వాయర్, ఐదు మీడియం రిజర్వాయర్లు ఉన్నాయని, శారదా, వరాహ నదులు లోతట్టు ప్రాంతాలలో చిన్నచిన్న లీకెజ్ సంభవించి గట్టులు తెగాయని, సంబంధిత సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నారన్నారు. వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా జాయింట్ కలెక్టర్లు వేణుగోపాలరెడ్డి ,అరుణ్ బాబు, రూరల్ ఎస్ పీ బి కృష్ణా రావు, జీవీఎంసీ కమిషనర్ జి సృజన, ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ నాగలక్ష్మి, ఇతర జిల్లా అధికారులు హాజరయ్యారు.






# రైతు నమోదు బాధ్యత వివిఎలదే

## - జేసీ సుమిత్ కుమార్



శ్రీకాకుళం : రైతులు మధ్యవర్తుల బారిన పడకుండా మద్ధతు ధర కల్పించేందుకు ఇకపై అన్ని రైతు భరోసా కేంద్రాలు రైతు సేవ కేంద్రాలుగా పనిచేయనున్నాయని సంయుక్త కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు విషయమై ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పి.ఎ.సి.యస్) సి.ఇ.ఓలు, కంప్యూటర్ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమం బుధవారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జె.సి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 248 ధాన్యం సేకరణ కేంద్రాలు ప్రారంభం కానున్నాయని, ఈ ఏడాది నుండి రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. ఇందుకు ప్రతీ రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాల్సి ఉందని, రైతు నమోదు కార్యక్రమం గ్రామ అగ్రికల్చరల్ అసిస్టెంట్ (వి.ఎ.ఎ) మాత్రమే రైతు భరోసా కేంద్రం వద్ద నమోదు చేయాలని తేల్చిచెప్పారు. ఇందుకు ఇ-పంట రిజిస్ట్రేషన్ ఇన్ ప్రొక్యూర్ మెంట్ సాఫ్ట్ వేర్ లో నమోదు చేయాల్సి ఉంటుందని జె.సి స్పష్టం చేసారు. రైతులకు మద్ధతు ధర, ఎఫ్.ఏ. క్యు. ప్రమాణములు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ రైతులకు అందించే విషయమై గ్రామాల్లో గ్రామ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. రైతుల అవగాహన కొరకు మద్ధతు ధర, నాణ్యత ప్రమాణములు, రైతు నమోదుకు కావలసిన పత్రాల వివరాల బ్యానర్లను ప్రతీ రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయాల వద్ద ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రిజిష్టర్ అయిన పిదప రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు ఇచ్చిన షెడ్యూలు ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయాలని వివరించారు. శిక్షణకు హాజరైన ప్రతీ ఒక్కరూ ఆర్.బి.కెల ద్వారా ధాన్యం కొనుగోలుపై పూర్తి అవగాహన చేసుకోవాలని, బుధవారం నుండి ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులు శనివారం వరకు కొనసాగుతాయని తెలిపారు.

ఇందుకు సంబంధించిన సాంకేతిక పరమైన సందేహాలను నివృత్తి చేసుకోవాలని, మీరు అందించే సేవలు వలన జిల్లాలో ఏ ఒక్క రైతు నష్టపోరాదనే విషయాన్ని గుర్తెరగాలని జేసీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎ.కృష్ణారావు, పౌర సరఫరాల అధికారి , పి.ఏ.సి.ఎస్ సి.ఇ.ఓలు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# దసరా మండపాలకు అనుమతి లేదు



శ్రీకాకుళం : దసరా నవ రాత్రులు చేయుటకు మండ పాలకు అనుమతులు లేవని జిల్లా కలెక్టర్ జె నివాస్ స్పష్టం చేసారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పోలీసు సూపరింటిండెంట్ అమిత్ బర్దార్ తో కలసి మీడియాతో మాట్లాడుతూ కరోనా దృష్ట్యా వినాయక చవితికి మండపాలకు అనుమతులు ఇవ్వలేదని, అదేవిధంగా దసరా నవరాత్రుల మండపాలకు కూడా అనుమతులు ఇవ్వడం లేదన్నారు. కరోనా వైరస్ నివారణకు జిల్లాలో అనేక చర్యలు తీసుకున్నామని తద్వారా ప్రస్తుతం తగ్గుముఖం పట్టిందని కలెక్టర్ అన్నారు. అయితే కేరళ వంటి రాష్ట్రాల్లో రెండవ దశ ప్రారంభమై దేశంలోనే అత్యధిక కేసులు నమోదు అవుతున్న పరిస్థితిని గమనిస్తున్నామని ఆయన పేర్కొంటూ అటువంటి పరిస్థితి జిల్లాలో తలెత్తకుండా ప్రజలు సహకరించాలని కోరారు. కరోనా ఇంకా పూర్తిగా నిర్మూలన కాలేదని ప్రతి ఒక్కరూ గ్రహించాలని ఆయన అన్నారు. కరోనా వైరస్ వ్యాప్తిలోనే ఉందని, ప్రతి ఒక్కరూ మాస్కు ధరించాలని చెప్పారు. మాస్కు లేకుండా బయటకు రావద్దని హితవు పలికారు. కరోనా భారీన పడకుండా మాస్కు ధరించాలని, భౌతిక దూరం పాటించాలని, చేతులు తరచూ శుభ్రపరచుకోవాలని పేర్కొన్నారు. కరోనా లక్షణాలు ఉన్న వ్యక్తులు వెంటనే పరీక్షలు నిర్వహించు కొనుటకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దసరా సందర్భంగా ఆలయాల్లో కరోనా నిబంధనలు పాటిస్తూ దర్శనానికి అనుమతి స్తున్నామని కలెక్టర్ చెప్పారు. ప్రజలు తమ కుటుంబాల సంక్షేమం, ఆరోగ్యం దృష్ట్యా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

**అయ్యప్ప స్వామి విగ్రహం 40 సంవత్సరాలదే** : సారవకోట మండలం కోదఅడ్డపనస గ్రామం వద్ద బయల్పడిన అయ్యప్ప స్వామి విగ్రహం 40 సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించినదేనని పురావస్తు శాఖ అధికారులు తెలియజేసారని జిల్లా కలెక్టర్ నివాస్ తెలిపారు.

భక్తులు తండోపతండాలుగా వెళుతున్నారని, కరోనా ప్రభావాన్ని గమనించాలని కోరారు. విగ్రహం పురాతనమైనది కాదని గమనించాలని చెప్పారు. ఆ ప్రదేశం అభివృద్ధిపై ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆయన పేర్కొన్నారు. పోలీసు సూపరింటిండెంట్ అమిత్ బర్దార్ మాట్లాడుతూ దసరా ఉత్సవాలకు మండపాలకు తావులేదన్నారు. ఆలయ కమి టీలు ఎక్కడా రద్దీ లేకుండా చూడాలని, రద్దీ ఎక్కువ అవుతున్నప్పుడు పోలీసులకు సమా చారం అందించాలని కోరారు

# దుర్గాలమ్మ దసరా మహోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ



మధురవాడ : మహా విశాఖ 6 వ వార్డు పరిధి చంద్రంపాలెం జాతర గట్టుపై వెలసిన దుర్గాలమ్మ అమ్మవారి దసరా మహోత్సవాలు ఈనెల 17 శనివారం నుంచి అక్టోబర్ 25 వరకు జరగనున్నాయని ఆలయ సంఘం అధ్యక్షుడు పిళ్ళా సూరిబాబు, ఆలయ ధర్మకర్త కృష్ణం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు, బుధవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి గోడ పత్రికను కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నరసింహ మూర్తి శర్మ మాట్లాడుతూ ఈ నెల 17 శనివారం నుంచి అక్టోబర్ 25తారీకు వరకు ప్రతిరోజు విశేష పూజలు జరగనున్నాయని భక్తులు తమ గోత్రనామాలతో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు దుర్గాలమ్మ అమ్మవారిని పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకములు అలాగే అమ్మవారిని వివిధ రూపాల్లో తొమ్మిది రోజుల పాటు అలంకరించడం జరుగుతుందని భక్తులందరూ ముఖానికి మాస్క్ ధరించి, శానిటైజర్స్ పూసుకొని, సామాజిక దూరం పాటించి అమ్మవారిని దర్శించికోని తీర్థప్రసాదాలు స్వీకరిస్తారని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేసేందుకు కృషి



గాజువాక: గత ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి59వ వార్డ్ గణపతి నగర్ లో రక్షణ గోడ కూలిన ఘటన లో ప్రాణాలు కోల్పోయిన రామలక్ష్మిభర్తను వార్డ్ వైస్సార్సీపీ అధ్యక్షులు పుర్రె సురేష్ యాదవ్, కేజీహెచ్ లో బుధవారం పరామర్శించారు. వైద్యులు తో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త మల్ల విజయప్రసాద్ కలెక్టర్ గారి తో మాట్లాడారని,నష్ట పరిహారం ప్రభుత్వం తరపున సత్వరం విడుదలయ్యే లాగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబానిక్కి అండగా ఉంటామని చెప్పారు. పరామర్శించిన వారిలో సీనియర్ నాయకులు పొట్టి మూర్తి ,మడక అప్పారావు, స్టూడెంట్ ఇంచార్జి జిలాని తదితరులు పాల్గొన్నారు.

# బహుదా పరిస్థితి గమనిస్తున్నాం

## జిల్లా కలెక్టర్ జె.నివాస్

శ్రీకాకుళం : జిల్లాలో వర్షాలు, వరదల వలన అపాయకర పరిస్థితి లేదని జిల్లా కలెక్టర్ జె నివాస్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ వంశధారలో 40 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నందున మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేసామన్నారు. నాగావళి నదిలో 40 వేల క్యూసెక్కులు, మడ్డువలస రిజర్వాయర్ నుండి 23 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని అన్నారు. వీటి పరిధిలో ఎక్కడా నీరు నిలిచిన పరిస్థితి లేదన్నారు. బహుదా నదిలో 28 వేల క్యూసెక్కుల వరకు నీరు ప్రవహిస్తోందని, 40 వేల క్యూసెక్కుల నీరు వస్తే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తామన్నారు. 55 వేల క్యూసెక్కుల నీరు వస్తే హైవైపై రాకపోకలకు అంతరాయం కలగవచ్చని చెప్పారు. దీనిపై పూర్తి అప్రమత్తంగా ఉన్నామని ఆయన వివరించారు. ఇచ్చాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలో 19 వందల హెక్టార్లలో పంట నీట మునిగిందని, అయితే వరద నీరు తగ్గుముఖం పట్టిందని పేర్కొన్నారు. రెండు, మూడు రోజుల్లో నీరు తగ్గిన తరువాత నష్టం పరిస్థితి తెలుస్తుందని చెప్పారు. వంద ఎకరాల్లో ఉద్యానవన పంటలు కొంత నష్టపోయినట్లు తెలుస్తుందని, 18 ఇళ్ళు, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి రహదారులు దెబ్బతిన్నాయని ఆయన తెలిపారు. వీటి ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. మెలియాపుట్టి మండలం గోకర్ణపురంకు చెందిన ఎవ్వారి శ్రీనివాసరావు వరద కారణంగా మరణించారని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో పోలీసు సూపరింటిండెంట్ అమిత్ బర్దార్ ఉన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రిలో

# నాణ్యమైన వైద్య సేవలు

## - జిల్లా కలెక్టర్ జె.నివాస్

శ్రీకాకుళం : ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యసేవలను అందించడం జరుగుతన్నదని జిల్లా కలెక్టర్ జె.నివాస్ పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి సలహా సంఘం తొలి సమావేశం చైర్మన్ మరియు జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కరోనా నేపధ్యంలో వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ తో సహా ప్రతీ ఒక్కరూ మంచి సేవలందించారని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగిందని, ఇది అభినందనీయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో నాన్-కోవిడ్ పేషెంట్లకూ వైద్యం అందించాలని తెలిపారు. నిరుపేదలతో పాటు మధ్యతరగతి ప్రజలు సైతం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలకు రావాలన్నారు.

అనంతరం కో-చైర్మన్, శాసన సభ్యులు ధర్మాన ప్రసాద రావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి అట్టడుగు వర్గాల ప్రజలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని తెలిపారు. మన జిల్లాలో మన కలెక్టర్ జె.నివాస్ కోవిడ్ సమయంలో అత్యంత శ్రద్ధతో పని చేసి విజయవంతంగా కోవిడ్ ను ఎదుర్కోవడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మంచి సేవలను అందించడం జరుగుతున్నదని, ఆసుపత్రిని మరింతగా అభివృద్ధి పరచవలసిన ఆవశ్యకత వుందన్నారు. ఇందుకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ తగు సూచనలు, సలహాలను అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన వైద్యులు, మంచి సౌకర్యాలు, చక్కటి ఎక్విప్ మెంటు వుంటాయని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రుల కంటె ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవం సురక్షితమని, జిల్లావాసులు ప్రభుత్వ ఆసుపత్రులను వుపయోగించుకోవాలని కోరారు. డెలివరీలతో పాటు ఆసుపత్రిలో లేప్రోస్కోప్, ఆర్థో, ఇ.ఎన్.టి, ఎండోస్కోప్, గైనిక్ కు సంబంధించిన అనేక సర్జరీలను విజయవంతంగా నిర్వహించడం జరుగుతున్నదని ప్రజలు సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో హెల్ప్ డెస్క్ ద్వారా పేషెంట్లను గైడ్ చేయాలన్నారు.

ఎం.వి.పద్మావతి మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుండి నిరుపేద ప్రజానీకం వైద్య సేవలకోసం ప్రభుత్వ ఆసుపత్రికి రావడం జరుగుతుందని, వారికి ఏ, ఏ విభాగాలలో ఏ ఏ సేవలు అందుతాయి వంటి వివరాలు తెలపడానికి సిబ్బందిని అందుబాటులో వుంచాలన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆసుపత్రిని పరిశుభ్రంగా నిర్వహించాలని తెలిపారు.

ఆసుపత్రి నిధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆసుపత్రికి ప్రత్యేక నీటి సదుపాయాన్ని కలుగచేయాలని, ఇందుకు సంబంధించి రెండు ట్యాంకులు ఏర్పాటు చేయాలని తెలిపారు.

కెప్టెన్ జగదీష్ మాట్లాడుతూ ఆసుపత్రికి పేషెంట్లతో పాటు వచ్చిన వారికి ఎకామడేషన్ సదుపాయం కలుగచేయాలన్నారు. రెగ్యులర్ ప్రాతిపదికన సేఫ్టీ, సెక్యూరిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని, పాము కాటు మందులు (ఎంటీ వీనమ్ డోస్ లు ) అందుబాటులో వుంచాలని సూచించారు. వరుదు విజయ్ కుమార్ మాట్లాడుతూ, ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను ప్రజలకు విస్తృతంగా తెలియచేయాలన్నారు.

మొదటి పేజీ తరువాయి

# సహాయక చర్యలు మరింత ముమ్మరం చేయండి

నుంచి 4 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మరో 24 గంటల్లో ఆ వరద చేరుతుంది. ఏ పరిస్థితి అయినా ఎదుర్కోవడం కోసం గుంటూరు, కృష్ణా జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి. విజయవాడలో ఇళు ఖాళీ చేయించే వారికి తప్పనిసరిగా వసతి కల్పించాలి. ప్రకాశం బ్యారేజీ వద్ద 7.5 లక్షల క్యూసెక్కుల వరద వచ్చే వీలుంది, కాబట్టి ఆ మేరకు సిద్ధంగా ఉండండి.

**విద్యుత్ పునరుద్ధరించాలి** : విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చాలా ముఖ్యం, దాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టాలి.

ఆ తర్వాత కాలువలు, చెరువుల గండ్లు పూడ్చడంతో పాటు, రహదారుల మరమ్మతు పనులు కూడా యుద్ధప్రాతిపదికన జరగాలి. అన్ని చోట్లా రహదారులు బాగు చేసి, అందుబాటులోకి తేవాలి. 4-5 నెలల్లో శాశ్వత ప్రాతిపదికన కూడా మరమ్మత్తులు పూర్తి చేయాలి.

**ఆర్థిక సహాయం చేయాలి**

వేర్వేరు జిల్లాలలో చనిపోయిన 10 మంది కుటుంబాలకు వెంటనే పరిహారం చెల్లించండి. అదే విధంగా వెంటనే నష్టం అంచనాలు వేయండి, వారం రోజుల్లో నష్టంపై అంచనాలు పంపండి. తూర్పు గోదావరి జిల్లాలో ఏలేరు రిజర్వాయర్ వల్ల పిఠాపురంలో వరద వస్తోంది కాబట్టి, అవసరమైన ఆధునీకరణ చేపట్టండి. వర్షాలు తగ్గాయి కాబట్టి, ఇంకాస్త అప్రమత్తంగా ఉండండి.

**నీటిని వృథాగా పోనీయొద్దు**

రిజర్వాయర్లు నింపడం, అక్కడి నుంచి కాలువల ద్వారా ప్రతి చెరువు నింపడంపై రాయలసీమతో పాటు, శ్రీకాకుళం, విజయనగరం, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆ మేరకు ఒక కార్యాచరణ ప్రణాళిక కూడా సిద్ధం చేయండి. చిత్తూరు జిల్లాలో 40 శాతం అధిక వర్షాలు కురిసినా, కేవలం 30 శాతం మాత్రమే ట్యాంకులు నిండడం పరిస్థితికి అద్దం పడుతోంది. దీన్ని పూర్తిగా మార్చి, కురిసే ప్రతి నీటి బొట్టుని ఒడిసి పట్టాలి,తద్వారా రిజర్వాయర్లు, చెరువులు నింపాలి. కరువు నివారణలో శాశ్వత పరిష్కారం చూడాలి. నెల్లూరు జిల్లాలో కండలేరులో ఈసారి గరిష్టంగా 60 టీఎంసీల నీరు నిల్వ చేయబోతున్నాం. ఇప్పటి వరకు కండలేరులో గరిష్టంగా 50 టీఎంసీలు మాత్రమే నిల్వ చేశాం.

**మానవతా దృక్పథం చూపండి**

సహాయ శిబిరాల్లో (షెల్టర్లలో) ఉన్న వారి పట్ల పూర్తి మానవతా దృక్పథంతో వ్యవహరించండి,వారికి కనీసం రూ.500 చొప్పున ఇవ్వండి. వారి ఇళ్లలో పరిస్థితి ఎలా ఉందో తెలియదు కాబట్టి, అన్నింటిని ఆరా తీసి ఆదుకోండి.

వ్యవసాయశాస్త్రవేత్తల సూచనలు: పూనం మాలకొండయ్య

కాగా, వరదలు తగ్గుముఖం పట్టాక వ్యవసాయ, ఉద్యానవన వర్సిటీలు, కృషి విజ్ఞాన కేంద్రాలకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవసరమైన సూచనలు చేస్తారని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య వెల్లడించారు. పంటల నష్టంపై వీలైనంత త్వరగా అంచనాలు పూర్తి చేసి పంపాలని ఆమె జిల్లాల కలెక్టర్లను కోరారు. భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పటికీ ధాన్యం సేకరణ యథావిధిగా కొనసాగుతుందన్న ఆమె, ఆ మేరకు ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల వద్ద రిజిస్ట్రేషన్ కొనసాగుతోందని చెప్పారు.

పక్కాగా శానిటేషన్: గోపాలకృష్ణ ద్వివేదీ

వరదలు సంభవించిన అన్ని చోట్ల శానిటేషన్ కోసం తగిన ఏర్పాట్లు చేశామని, అన్ని చోట్ల అవసరమైన బ్లీచింగ్ పౌడర్ అందుబాటులో ఉంచామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదీ వెల్లడించారు. ఇప్పటికే అంతటా శానిటేషన్ చర్యలు మొదలయ్యాయన్న ఆయన, తాగు నీరు కూడా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని చెప్పారు.

# 24 గంటలపాటు అప్రమత్తంగా ఉండాలి

కాపాడటంతో పాటు ముంపు ప్రాంతాల బాధితులను పునరావాస కేందరాలకు తరలించడంలో పోలీసు శాఖ చొరవ ప్రశంసనీయం అన్నారు. ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో సమన్వయంతో పోలీసులు పని చేయాడం అభినందనీయమని డీజీపీ వ్యాఖ్యానించారు. తప్పనిసరిగా 100/112కు డయల్ చేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**చెరువు తలపించిన వెలగపూడి హైకోర్టు ప్రాంగణం:**

ఒక్కరోజు కురిసిన వర్షానికి వెలగపూడి తాత్కాలిక హైకోర్టు ప్రాంగణం చెరువును తలపిస్తోంది. హైకోర్టుకి వెళ్లే మార్గంలో వెలగపూడి వద్ద రోడ్డుపై దాదాపు మూడు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. దీంతో హైకోర్టుకి వచ్చే ఉద్యోగులు, న్యాయవాదులు, కక్షిదారులు చెరువుగా మారిన రోడ్లపై ప్రయాణిస్తూ నానా ఇబ్బంధులు ఎదుర్కొన్నారు.

# స్టార్స్ ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

ఆయన పేర్కొన్నారు. కేంద్ర సర్కారు స్పాన్సర్ చేస్తున్న ఈ స్టార్స్ ప్రాజెక్టును స్కూల్ ఎడ్యుకేషన్ & లిటరసీ డిపార్టుమెంట్, విద్యాశాఖ ద్వారా అమల్లోకి తీసుకొస్తారని ప్రకాశ్ జవదేకర్ చెప్పారు. ఇది హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కేరళ, ఒడిశా రాష్ట్రాల్లో అమల్లోకి రానుందని తెలిపారు. అదేవిధంగా కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్ముకశ్మీర్, లఢక్‌లకు రూ.520 కోట్ల ప్రత్యేక ప్యాకేజీకి కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీన్‌దయాల్ అంత్యోదయ యోజన నేషనల్ రూరల్ లైవ్లీహుడ్స్ మిషన్ కింద ఈ ప్యాకేజీని అందిస్తున్నారు.

# ఏపీలో ఏడు పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ కేంద్రాలు

నిర్మాణ పనులు చేపడతామని నెడ్‌క్యాప్ ఎండీ రమణారెడ్డి తెలిపారు.


కోతలకు అవకాశం లేకుండా..

పీక్ డిమాండ్ (ఎక్కువ వినియోగం ఉండే సమయం)లో విద్యుత్‌కు అధిక ప్రాధాన్యత ఉంటుంది. ఈ సమయంలో విద్యుత్ ఉత్పత్తి అందుబాటులో ఉంటే కోతలకు ఆస్కారం ఉండదు. సోలార్, పవన విద్యుత్ ఉత్పత్తి సమయంలో వినియోగం తక్కువగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

**పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ కేంద్రాల నిర్మాణం**

నీటి రిజర్వాయర్ల దగ్గర ఎత్తయిన ప్రదేశంలో ప్రత్యేకంగా నీటి నిల్వ కోసం ఓ రిజర్వాయర్‌ను నిర్మిస్తారు. కిందకు వెళ్లిన నీటిని పంపుల ద్వారా ఎగువ ప్రాంతంలో ఉన్న రిజర్వాయర్‌లోకి పంపుతారు. నాన్ పీక్ అవర్స్ (డిమాండ్ లేని సమయం)లో సౌర, పవన విద్యుత్‌తో దిగువన ఉన్న నీటిని ఎగువన ఉన్న రిజర్వాయర్‌కు తరలిస్తారు. దీనివల్ల అవసరమైనప్పుడు జల విద్యుత్‌కు అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో డిమాండ్ ఉండే సమయంలో పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది.

దీంతో ఎక్కువ ధరకు బహిరంగ మార్కెట్‌లో విద్యుత్‌ను కొనే ఇబ్బంది తప్పుతుంది. సౌర, పవన విద్యుత్‌లనూ మనమే ఉపయోగించుకోవచ్చు. ఈ కేంద్రాల కాలపరిమితి దాదాపు 80 ఏళ్లు. నిర్మాణ వ్యయం తొలి 25 ఏళ్లలోనే తీరిపోతుందని నిపుణులు చెబుతున్నారు. తర్వాత చౌకగా జలవిద్యుత్ అందుతుంది. కాగా రాష్ట్రంలో 29 ప్రాంతాల్లో 32 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ కేంద్రాల ఏర్పాటుకు అవకాశాలున్నట్లు గుర్తించారు.



***ఆంధ్ర యూనివర్సిటీ గెస్ట్ హౌస్ డీన్ గా బాధ్యతలు స్వీకరించిన షారోన్ రాజ్ కు అభినందనల వెల్లువ***

*ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ షారోన్ రాజ్ ఇటీవలే ఆంధ్ర యూనివర్సిటీ గెస్ట్ హౌస్ డీన్ గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో వైసీపీ 51 వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి రెయ్యి వెంకటరమణ బుధవారం మర్యాద పూర్వకంగా కలసి పుష్ప గుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. దళితులకు ఉన్నతమైన పదవులు ఇచ్చి దళిత అభివృద్ధిని వైఎస్ఆర్ పార్టీ ముందుకు నడిపించడం అభినందనీయమని ఈసందర్భంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.*

# ఆసెట్‌కు 87.56 శాతం హాజరు

## పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఇంఛార్జి రిజిస్ట్రార్


పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఇంఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.విరవీంద్రనాథ్ బాబు

ఏయూ : ఆంధ్రవిశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఆసెట్ ప్రవేశ పరీక్షకు రెండవరోజు 87.56 శాతం హాజరు నమోదయ్యింది. ఉదయం పరీక్ష కేంద్రాలను ఏయూ ఇంచార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.వి రవీంద్రనాథ్ బాబు పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తనిఖీ చేశారు. బుధవారం కెమికల్ సైన్స్, తెలుగు, ఫిజికల్ సైన్స్, ఎంకాం కోర్సులకు పరీక్షలు జరిగాయి. మెత్తం 7401 మంది దరఖాస్తు చేసుకోగా 6481 మంది పరీక్షకు హాజరయ్యారు. దీనితో తొలిరోజు పరీక్షకు 87.56 శాతం హాజరు నమోదయ్యింది. పరీక్షలను ప్రశాతం వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు ఆచార్య డి.ఏ నాయుడు తెలిపారు. పరీక్షల నిర్వహణను అసోసియేట్ డైరెక్టర్లు ఆచార్య ఎస్.బి పడాల్, డాక్టర్ సి.వి నాయుడులు పర్యవేక్షించారు. గురువారం హ్యూమా నిటీస్ సోషల్ సైన్సెస్, మేథమేటికల్ సైన్సెస్, ఎంహెచ్ఆర్ఎం, ఆరేళ్ల సమీకృత ఇంజినరింగ్(ఆఈట్) పరీక్షలు జరుగుతాయి.

## విద్యుత్ సమస్య పరిష్కరించాలంటూ నిరసన



అచ్యుతాపురం : భోగాపురం పంచాయితి కొత్తవీధిలో విద్యుత్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే విద్యుత్ సమస్య పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ సమస్య పరిష్కరించాలంటు సిఐటియు ఆద్వర్యంలో మహిళలు నిరసన చేపట్టారు. ఈ నిరసనలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భోగాపురం కొత్తవీధిలో విద్యుత్ స్తంభాలకు కొత్త కేబుల్ వైర్లు, కొత్త ట్రాన్స్ఫార్మర్ వేసి విద్యుత్ సమస్య లేకుండ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం విద్యుత్ ఏఈ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డి ప్రకాష్, రమణమ్మ, పైడితల్లి తదితర మహిళలు పాల్గొన్నారు.

## మాజీ సైనికుల సొసైటీ పై

# దుష్ప్రచారం తగదు

డాబాగార్డెన్స్ : ప్రభాతవార్త మాజీ సైనికుల సొసైటీపై జరుగుతున్న దుష్ప్రచారం తగదని ఎక్సెసర్వీస్మెన్ మ్యూచివల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ, విశాఖపట్నం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్. శివశంకరరావు, కార్యదర్శి సిహెచ్.మోహనరావు తెలిపారు. మంగళవారం సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సొసైటీలో సభ్యుల నుంచి 24 కోట్లు రూపాయలు వసూలు చేసిన విషయం వాస్తవమేనన్నారు. అందులో 7.78 కోట్లు పెట్టి ఆనందపురం మండలం, దబ్బందలో 50 ఎకరాలు సేకరించి రైతులకు చెల్లించామని, మరికొంత అచ్యుతాపురం మండలం కొడకర్లలో 31ఎకరాలు జిరాయితీ కొనుగోలుచేసామని వివరించారు. 3.22 కోట్ల రూపాయలు దుర్వినియోగం జరిగిందని, దీనిపై డిస్ట్రిక్ట్ కోపరేటివ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేసామని, దీనిపై ఎంక్వైరీ జరుగుతుందన్నారు. సొసైటీ సేకరించిన స్థలం సుమారు 80 ఎకరాలు అందువల్ల సభ్యులు దయఉంచిఈ సెల్ఫ్ సైల్ అడహాక్ కమిటి మాటలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. అందరికి న్యాయం జరుగుతుందని తెలిపారు.

## వృధా గా పోతున్న బోర్ వాటర్



భీమునిపట్నం : గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షాల కు స్థానిక నూకాలమ్మ గుడి దగ్గర ఉన్న వీధి బోర్ లో నుంచి వృధా గా నీరు పోతున్నది. వర్షాలు కారణంగా జలాశయాలు నిండడంతో నీరు బయటకు పోతుందనీ స్థానికులు అంటున్నారు.

## శ్రీనివాస్ తాండవకు


# పిహెచ్‌డి అవార్డు ప్రదానం



ఆంధ్రయూనివర్శిటీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ మరియు కామర్స్ కళాశాలలోని వాణిజ్య మరియు నిర్వహణ విభాగానికి చెందిన పరిశోధన విద్యార్థి శ్రీనివాస్ తాండవకు పిహెచ్‌డి అవార్డును ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రకటించినది. వాణిజ్య మరియు నిర్వహణ విభాగానికి చెందిన ఆచార్యులు వడ్డాది కృష్ణమోహన్ ఆధ్వర్యంలో సాగిన పరిశోధన అంశం 'వ్యవసాయ రంగంలో సుస్థిర వృద్ధికి మార్కెటింగ్ నమూనాలు (ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో రైతులపై ఒక అధ్యయనం)కు గాను శ్రీనివాస్ తాండవ అను పరిశోధకుడికి పిహెచ్‌డి అవార్డును ప్రదానం చేసినది.

## ప్రజ్ఞ సుమకు

# పిహెచ్‌డి అవార్డు ప్రదానం




ఆంధ్రయూనివర్శిటీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంటుకి చెందిన పరిశోధన విద్యార్థిని వి.ప్రజ్ఞ సుమకు పిహెచ్‌డి అవార్డును ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రకటించినది.

వాణిజ్య మరియు నిర్వహణ విభాగానికి చెందిన ఆచార్యులు వి.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో 'సింబాలిక్ కంసంప్షన్ ఆఫ్ బ్రాండెడ్ అపరెల్స్ ఇన్ ఇండియా, ఎ కేస్ స్టడీ ఆన్ కన్స్యూమర్ డైనమిక్స్ ఇన్ బ్రాండ్ ఛాయిసెస్' అనే అంశంలో పరిశోధన జరిపినందుకు గాను పిహెచ్‌డి అవార్డును ప్రకటించినది.

## చొంపి జంక్షన్ లో

## అరకు పోలీస్ సిబ్బంది భారీ తనిఖీలు



అరకులోయ : అరకు మండల పట్టణ కేంద్రంలో గల చొంపి జంక్షన్ లో అరకులోయ పోలీసు సిబ్బంది భారీ తనిఖీలు నిర్వహించారు.పర్యాటక ప్రాంతం కావడం నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో వచ్చేపోయే వాహనాలను తనిఖీలు నిర్వహించి.అలాగే ప్రతి ఒక్కరూ హెల్మెట్లు,సీటిబెల్టు వేసుకొని వాహనాలు నడపాలన్నారు.కరోన వైరస్ గురించి వాహనదారులను అవగాహన కల్పించారు.

### బెస్ట్ ప్రైస్ స్టోర్లు, ఫ్లిప్కార్ట్ హెూల్సేల్లోనూ బిగ్ బిలియన్ డేస్ ఆఫర్లు

విశాఖపట్నం : ఫ్లిప్కార్ట్ గ్రూప్తో పాటు బెస్ట్ప్రైజ్, ఫ్లిప్కార్ట్ హెూల్సేల్లు బిగ్బిలియన్ డేస్ ద్వారా భారత్లోని లక్షలాది మంది రిటైలర్లకు, చిన్న వ్యాపారాలకు పండగ సంతోషాలను పంచ నున్నాయి. ఈ నెల 16 నుంచి 21 వరకు బిగ్ బిలియన్ డేస్ నిర్వహిస్తారు.

## జివియంసి ప్రాథమిక పాఠశాలలో...

# తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం



విశాఖపట్నం : అక్కయ్యపాలెం జివియంసి ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవంబర్ 2 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల కోసం పాఠశాలలో తీసుకుంటున్న జాగ్రత్తల గురించి తల్లిదండ్రులకు వివరించారు. అదేవిధంగా ఇంటి నుంచి పిల్లల్నిపాఠశాలకు పంపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, పరిశుభ్రత తదితర అంశాల గురించి విపులంగా తెలియజేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో.. ఉపాధ్యాయులు ఎన్. వరలక్ష్మి, గౌసియా బేగం, వెంకటలక్ష్మి, లలితాంబ, మాధురి, పాఠశాల చైర్మన్ సిహెచ్ నాగమణి, శ్రావణి, భాగ్యలక్ష్మి, పాఠశాల విద్యా సెక్రటరీలు తేజేశ్వరరావు, పద్మావతి పాల్గొన్నారు.

# చెరువును తలపిస్తోన్న రోడ్డు



భీమునిపట్నం : తగరపువలస జాతీయ రహదారి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం నుండి సంగివలస మద్యలో ఉన్న రోడ్డు పై ఉన్న వర్షపునీరు చెరువను తలపిస్తోంది. గత నాలుగు రోజులు గా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకి రహదారి అంతా జలమయమయ్యింది.రహదారి విస్తరణలో భాగంగా బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండడంతో ఈ విధంగా నీరు నిలువై ఉంటుంది. వీదులలో నుండి వచ్చే వర్షపునీరు ఇటీవల చెరువలోకి రెండు మార్గాల ద్వారా వెళ్ళేది కాని ఒక మార్గం మూసి వేయడం, రెండవమార్గం ద్వారా వర్షపునీరు సజావుగా వెళ్లకపోవడంతో ఈ వర్షపునీరు రహదారిపై చెరువును తలపించేవిదంగా నిలువ ఉండిపోయింది.దీంతో వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.స్పందించిన భీమునిపట్నం జోనల్ అధికారులు వర్షపునీటిని డీజిల్ మోటర్ సహాయం తో చెరువులోకి తోడుతున్నప్పటికీ చెరువు కూడా పూర్తిగా నిండిపోవడంతో నీరు ఈ విధంగా రహదారిపై నిలుస్తోంది. అలాగే భీమునిపట్నం ఎగువపేటలో కూడా రోడ్డు పై నీరు మోకాలి లోతుగా ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

## 5ఏళ్ళలోపు చిన్నారులకు

# విటమిన్ ఏ ద్రావణాన్ని విధిగా వేయించాలి


ద్రావణాన్ని పంపిణీ చేస్తున్న దృశ్యం

గాజువాక: చిన్నారులకు కంటిసమస్య నివారణకు విటమిన్ ఏ ద్రావణాన్ని ఏడాదికి రెండుసార్లు విధిగా వేయించాలని హెల్త్ సూపర్‌వైజర్ మల్లిబాబు తెలిపారు. బుధవారం గాజువాకలోని పలు ప్రాంతాలోని ఆరోగ్య కేంద్రాలలో ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు చిన్నారులకు ఏ విటమిన్ ద్రావణాన్ని పంపిణీ చేసారు. ఈ సంధర్భంగా పి.హెచ్.సి హెల్త్ సూపర్‌వైజర్ మల్లిబాబు మాట్లాడుతూ 5ఏళ్ళు లోపున్న చిన్నారులందరికీ 5సార్లు ఈ ద్రావణాన్ని వేయించాలన్నారు. మొదటిసారి 10నెలలకు, రెండోసారి6ఎలలకు మిగిలిన ప్రతీసారి ప్రతీ ఆరునెలలకు ఒకసారి చొప్పున ఈ ద్రావణాన్ని ఇప్పించాలని తెలిపారు. దీని ద్వారా కంటి సమస్యలతో పాటు,చిన్నారులలో అనారోగ్యసమస్యలు తలెత్తవని అన్నారు. ఈ అవకాశాన్ని అన్ని ప్రాధమిక ఆరోగ్యకేంద్రాలలో అందుబాటులో ఉంటుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని మల్లిబాబు కోరారు.

## జూమ్ ఆన్‌లైన్ ద్వారాజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం

విశాఖపట్నం : బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం బుధవారం జూమ్‌ఆన్‌లైన్ ద్వారా జరిగింది. ఈ సమావేశం కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శశిభూషణ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండలం లో మోడీ గారు ప్రవేశపెట్టిన రైతు పథకాలు పాంప్లెట్ ద్వారా ప్రచారం చేస్తూ, అలాగే వర్షప్రభావం ఏ.. ఏరియాలో పంటలు నష్ట పోయాయి, రైతు కష్టాలు తెలుసుకొని అధికారులకు తెలియచేసి రైతులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలి, అవసరం అయితే ప్రభుత్వం తో పోరాడదాం అని అన్నారు.

అలాగే సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వేటుకూరి సూర్య నారాయణరాజు బీజేపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మాట్లాడుతూ 2024 ఈ రాష్ట్రమ్ లో బీజేపీ అధికారం లో రావడానికి కిసాన్ మోర్చా విభాగం ముఖ్య భూమిక పోషించాలని, ప్రతి పల్లెలో మన టీం రైతు అవగాహనా సదస్సు లు పెట్టి మన ప్రియతమ ప్రధాని ప్రవేశపెట్టిన పథకాలు వాళ్లకు అర్థమయ్యేలా చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు అంజిబాబు, కె.వి.రమణ, సాంబశివరావు, సాయిరాం మిగతా పదాధి కారులు పాల్గొన్నారు.

## కోవిడ్ - 19 పై విద్యార్థుల తల్లిదండ్రులకు

## అవగాహన కార్యక్రమం


విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సిఆర్‌పికెవిఎం నాయుడు

చోడవరం : కోవిడ్ - 19 వైరస్ బారిన పడకుండ ఉండేందుకు ప్రతి ఒక్కరూ కోవిడ్ నిబంధనలు విధిగా పాటించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. చోడవరం పట్టణంలోని బాలికోన్నత పాఠశాల, మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమగ్ర శిక్ష అభియాన్ పథక సంచాలకులు ఆదేశాల మేరకు సి ఆర్ పి కె వి ఎం నాయుడు ఆధ్వర్యంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తల్లిదండ్రులు కరోనా నియంత్రణకు అవలంభించాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి వసంత, విద్యా కమిటీ చైర్మన్ డి కుమారి, ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి సి హెచ్ దొర, విద్యా కమిటీ చైర్మన్ లక్ష్మి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు రమణి, జగదాంబ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకుని

# అంగన్వాడీ టీచర్ ఆత్మహత్య



దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో విషాద ఘటన చోటు చేసుకుంది. శారీరక రుగ్మతలు తట్టుకోలేకే వంజివంజుల రాములమ్మ (55)అనే మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీ కోరపర్తి లో అంగన్వాడీ టీచర్ గా పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. కొన్నేళ్ళుగా అనారోగ్యంతో బాధపడుతూ.. మానసిక వేదనకు గురవుతున్నారని తెలిపారు. మృతురాలి భర్త ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి. సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు .గ్రామ పెద్దల సమక్షంలో శవపంచినామ జరిపి పోస్టుమార్టం కోసం చోడవరం ఆసుపత్రి కి తరలించారు.

# విజయభాను
## సంపాదకీయం

### అసమాన విద్య ఆదర్శం కాదు

ఇలాంటి విద్యావిధానంలో పరీక్షల ఫలితాలకు, తర్వాత ఉన్నత చదువులలో, లేదా ఉద్యోగాల్లో ప్రతిభకు ఎలాంటి సంబంధం లేదని తెలిపే అధ్యయనాలు చాలా ఉన్నాయి. పదేండ్ల క్రితం గూగుల్ నిర్వహించిన అధ్యయనం ప్రాజెక్ట్ ఆక్సిజెన్ కూడా ఈ విషయాన్నే తేల్చింది. ఈ పరిమిత నైపుణ్యాల సముపార్జన సంపన్న వర్గాలకు, ముందే విద్యావంతులైన తరానికి అనుకూలమవుతాయి.

జాతీయ విద్యావిధానం 2020 డాక్యుమెంట్‌లో సాహసోపేతమైన సంస్కరణలున్నాయని, ఇది విద్యారంగాన్ని సంపూర్ణంగా పరివర్తన చెందిస్తుందనే అభిప్రాయాలు కొన్ని వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. కాని ఈ డాక్యుమెంట్, గత నలభై సంవత్సరాలుగా సంక్షేమ రాజ్య లక్ష్యాల నుంచి పక్కకు తొలగడం వలన విద్యా వ్యవస్థ చెల్లిస్తున్న మూల్యం నుంచి పాఠాలను స్వీకరించలేదు. అలాగే ప్రపంచవ్యాప్తంగా జరిగిన విద్యా సంస్కరణల దుష్పరిణామాలను గుర్తించకుండానే, అదే దారి ప్రయాణాన్ని ప్రకటిస్తున్నది. ఆ దారి గమ్యం మనిషిని నిర్మించడం కాదు, మార్కెట్‌ను నిర్మించడం. ఆర్థికాభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా కలిగిన మార్కెట్ ఎకానమీ నమూనా, కాగ్నిటివ్ ఎకనామిక్స్ చట్రంలో నైపుణ్యాలను, సామర్థ్యాలను నిర్ధారిస్తుంది, అంటే ఆర్థికాభివృద్ధికి, మార్కెట్‌కు అవసరమైన లాజికో మ్యాథమెటికల్ (సైన్స్, గణితం), కమ్యూనికేషన్ నైపుణ్యాలకే ప్రాధాన్యమిస్తుంది. ఈ నైపుణ్యాలు పెరిగితే హ్యూమన్ కాపిటల్ పెరుగుతుంది, దానితోనే ఆర్థికాభివృద్ధి జరుగుతుంది అనేది ఈ కాగ్నిటివ్ ఎకనామిక్స్ చట్రం వెనుక ఉన్న తర్కం.

చదువులు ఆర్థికాభివృద్ధి కోసమే అనే భావన ఇప్పటిది కాదు. మొదటి పారిశ్రామిక విప్లవ కాలం నుంచి కొనసాగుతున్నది. ఆయా కాలాల్లోని పనులకు, పరిశ్రమలకు అనుగుణమైన నైపుణ్యాలనిచ్చే లక్ష్యం విద్యకు ఉంది, దానివలన సమాజాలకు లాభమే జరిగింది. అయితే, ప్రపంచీకరణ ఫలితంగా జరిగిన ఆర్థిక విధానాల సరళీకరణ తర్వాతనే అతి కొద్ది మంది లాభమే విద్యా లక్ష్యం అయింది. వారి అవసరాల కోసం కావాల్సిన నైపుణ్యాలను అందించడమే విద్య ప్రధాన లక్ష్యంగా ఉండేటట్లు ఈ కాగ్నిటివ్ ఎకనామిక్స్ చట్రం ప్రభావితం చేస్తుంది. దీనితో, ఈ నైపుణ్యాలను కొలవడమే విద్యా ప్రక్రియ ప్రాధాన్య అంశం అవుతుంది. ఈ కొలతల ఆధారంగా ప్రతిభ, నాణ్యతలు అని నిర్ధారిస్తుంటారు. వీటి ప్రాతిపదికనే పిల్లలను, టీచర్లను, విద్యాసంస్థలను కొలుస్తారు, ర్యాంకులు, గ్రేడులు ఇస్తారు. ర్యాంకింగ్‌లో ముందున్న విద్యాసంస్థలకే నిధులనివ్వడం, వెనుకబడిన వాటిని క్రమంగా మూసేయడం జరుగుతుంది. కల్పించవలసిన మౌలిక వసతులు, వనరుల కంటే ఈ నైపుణ్యాల సాధన కొలతలకు ప్రాధాన్యం పెరుగుతుంది. ఈ వలయంలో ప్రైవేటు సంస్థలు బాగా పనిచేస్తున్నట్లు అనిపించడంతో ప్రైవేటీకరణకు ప్రోత్సాహం లభిస్తుంది. అలాంటి విద్యాసంస్థల్లో చదువుకునేందుకు ప్రాధాన్యం పెరుగుతుంది. ఈ క్రమంలో సోషియాలజీ ఆఫ్ ఎడ్యుకేషన్ విస్మరణకు గురవుతుంది. విద్యా లక్ష్యాలు కుదింపునకు గురవుతాయి. ఇది గత నాలుగు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామం.

3,5,8 తరగతుల్లో సామర్థ్యాల అంచనా పరీక్షలను పాఠశాల స్థాయిలో అంతర్గతంగా గాక బాహ్య సంస్థలతో నిర్వహిస్తారు. 10, 12 తరగతులకు వార్షిక బోర్డ్ పరీక్షలు, ఉన్నత విద్యలో ప్రవేశాలకు, ఉద్యోగ నియామకాలకు ఎన్టీయే దేశవ్యాప్తంగా పరీక్షను నిర్వహిస్తుంది. దీనితో ప్రమాణాలు పెరుగుతాయని ఈ డాక్యుమెంట్ భావిస్తున్నది. మరొకవైపు పరీక్షలకు ప్రాధాన్యం తగ్గించాలని, కరికులం ఒత్తిడి తగ్గించాలని, స్కూల్ బ్యాగు బరువు తగ్గించాలని, బట్టీ విధానాలను రూపుమాపాలని భావిస్తున్నది. కింది నుంచి పైదాకా దేశవ్యాప్తంగా కేంద్రీకృతంగా పరీక్షల ప్రతిపాదనతో ఇది నెరవేరదని ఎవ్వరైనా చెప్పగలుగుతారు. ఈ కాగ్నిటివ్ ఎకనామిక్స్ చట్రం వల్ల ప్రభావితమైన నైపుణ్యాలనైనా సమానంగా అందరికీ ఇవ్వగలుగుతున్నామా అనేది కూడా ఒక ప్రశ్నే. ఈ క్రమం కూడా అసమానతలతో కూడినదే.

ఇలాంటి విద్యావిధానంలో పరీక్షల ఫలితాలకు, తర్వాత ఉన్నత చదువులలో, లేదా ఉద్యోగాల్లో ప్రతిభకు ఎలాంటి సంబంధం లేదని తెలిపే అధ్యయనాలు చాలా ఉన్నాయి. పదేండ్ల క్రితం గూగుల్ నిర్వహించిన అధ్యయనం ప్రాజెక్ట్ ఆక్సిజెన్ కూడా ఈ విషయాన్నే తేల్చింది. ఈ పరిమిత నైపుణ్యాల సముపార్జన సంపన్న వర్గాలకు, ముందే విద్యావంతులైన తరానికి అనుకూలమవుతాయి.

భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు రాకుండా

## శాశ్వత ప్రాతిపదికన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి



**మొదటి పేజీ తరువాయి**

తెలిపారు. పొలాల ముంపునకు శారదానదిపై నిర్మించిన వంతెన ఒక కారణమని చెబుతున్నారని, నేవీ అధికారులతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. గండి పూడ్చివేతకు పనులను వెంటనే చేపట్టవలసినదిగా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించామని తెలిపారు. భవిష్యత్తులో యిటువంటి యిబ్బందులు రాకుండా శాశ్వత ప్రాతిపదికన కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు బి.వి.సత్యవతి, శాసనసభ్యులు యు.వి. రమణమూర్తిరాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





## కలెక్టర్ ను కలసిన వీరగున్నమ్మ యూనిట్

శ్రీకాకుళం : జిల్లాలో చారిత్రక నేపథ్యం గల వీరగున్నమ్మపై చిత్రీకరిస్తున్న యూనిట్ సభ్యులు జిల్లా కలెక్టర్ జె నివాస్ ను బుధ వారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలిశారు. డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి, గిరిజన విశ్వవిద్యాలయం ప్రత్యేక అధికారి మరియు వీరగున్నమ్మ చిత్రంలో జమీందారీ పాత్రధారి ప్రొ. హనుమంతు లజపతిరాయ్ నేతృత్వంలో చిత్ర యూనిట్ సభ్యులు కలెక్టర్ ను కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో వీరగున్నమ్మ ప్రభావం, స్వాతంత్ర్య సమరంలో ఆమె చూపిన తెగువ తదితర విషయాలను జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలో కోవిడ్ నివారణకు శాయశక్తులా కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్ నివాస్ కు చిత్ర యూనిట్ సభ్యులు సత్కరించారు. జిల్లా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ చారిత్రాత్మక చిత్రాలు భావితరాలకు స్ఫూర్తిదాయకంగాను, సందేశాత్మకంగాను ఉంటాయన్నారు. మందస కోటను, పరిసర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయుటకు చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో లఖినాన వెంకటాచలం, ఎల్.రవికుమార్, ఆదిత్య భరద్వాజ్, అప్పారావు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు కూడా ఉన్నారు.

## కవి సమయం

### అనర్హులకు అందలమివ్వరాదు

ఒక పని చెయ్యాలంటే ఆ పని చేసేవారికి దానిని పూర్తి చేసే శక్తిసామర్థ్యాలు వుండాలి. అంటే వారు ఆ పని చెయ్యడానికి అర్హులైయుండాలి. ప్రతి ఉద్యోగానికీ ఒక అర్హతను నిర్ణయిస్తారు. కాబట్టి వారు ఆ ఉద్యోగానికి సరిపోతారో లేదో, పని సరిగ్గా చెయ్యగలరా అనేవి పరీక్షించి వారికి ఆ ఉద్యోగం కేటాయిస్తారు. కానీ ఏం చేస్తాడో తెలియకుండా పొందే ఉద్యోగమే రాజకీయ పదవులు, ఒక ప్రజా ప్రతినిధిని మనం ఎన్నుకుంటే అతను ఏం చేస్తాడో తెలియదు. కాబట్టి మనం రాజకీయ నాయకులను ఎన్నుకునేటప్పుడు వారి అర్హతలను గుణగణాలను పరిశీలించి ఎన్నుకోవాలి. కానీ నేడు అధికారంలో, చట్టసభలలో ఉన్న వారిలో సగానికి సగం మంది నేరచరిత్ర కలిగిన వారే. వారు చట్టసభలో కూర్చున్నా తమ సహజ గుణాన్ని వీడకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. అటువంటి అనర్హులను అందలమెక్కిస్తే మన దేశప్రగతి ప్రశ్నార్థకంగా మారుతుంది. వారు పంచే డబ్బుకీ, పోసే మద్యానికి తలొగ్గి ఓటు వేస్తే అయిదు సంవత్సరాల పాటు వారు మనతో చెలగాటమాడతారు. కాబట్టి మంచివారిని రాజకీయాలలో ప్రోత్సహించాలి. అనర్హులకు అందలమివ్వరాదని ఓ శతకకవి ఇలా వ్రాశాడు.

'కనకపు సింహాసనమున
శునకము గూర్చుండబెట్టి శుభలగ్నమునన్
వొనరగ పట్టము గట్టిన
వెనుకటి గుణమేల మాను వినరా సుమతీ'

కవితా రచన:
వడ్లమాని అన్నపూర్ణ

## పంచాంగం

మాసం : అధిక ఆశ్వయుజ; తిథి :త్రయోదశి ఉ.6.25; చతుర్థశి తె.4.12; ఉత్తర సా.5.31; రా.వ.1.23ల 2.53

గురువారం 15-10-2020

**మేషం** : మీ శత్రువులే మీకు మిత్రులై సహాయ, సహకారాలను అందిస్తారు. కీలకమైన వ్యవహారాల్లో తీసుకున్న నిర్ణయాల వల్ల కష్టనష్టాలు ఎదుర్కొంటారు. వాహనం నడుపుటలో మెలకువ అవసరం. **వృషభం** : ప్రముఖులు, సన్నిహితుల కలయిక సాధ్యంకాదు. నిరుద్యోగయత్నాలు ఓ కొలిక్కి వస్తాయి. క్రయ విక్రయాలు సామాన్యం. మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. ఆత్మీయులకు విలువైన బహుమతులు అందిస్తారు. ఉద్యోగస్తులు ఎదురుచూస్తున్న ప్రమోషన్ అందుకుంటారు. **మిథునం** : అనుకున్న పనులు కొంత ముందు వెనుకలుగానైనా సంతృప్తికరంగా పూర్తి చేస్తారు. ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులకు, జాయింటు వ్యాపారస్తుల శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. గతంలో విడిపోయిన భార్యాభర్తలు తిరిగీ కలిసే అవకాశం ఉంది. నిత్యావసర వస్తు స్టాకిస్టులకు లాభదాయకం. **కర్కాటకం** : మీ సంతానం భవిష్యత్ గురించి కొత్త కొత్త ప్రణాళికలు రూపొందిస్తారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. ఉద్యోగం చేయు స్త్రీలకు దూరప్రాంతాలకు బదిలీలు అవుతాయి. శస్త్ర చికిత్స చేయునప్పుడు వైద్యులకు ఏకాగ్రత అవసరం. కార్మికులకు, ప్రైవేటు సంస్థలందు పనిచేసే క్రింది ఉద్యోగస్తులకు తగిన గుర్తింపు లభిస్తుంది. **సింహం** : సోదరీ, సోదరుల మధ్య ఆస్తి విషయాల గూర్చి తగాదాలు రావచ్చు. ప్రముఖుల ద్వారా ఉద్యోగస్తులు కొత్త పనులు చేపడతారు. కుటుంబంలో ఒకరి ధోరణి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. నూతన వ్యాపారాలు ప్రారంభించేందుకు అనువైన సమయం. కోర్టు వ్యవహారాలు వాయిదా పడుట మంచిది. **కన్య** : నిర్మాణ పనులలో కాంట్రాక్టర్లకు ఓర్పు, నేర్పు ఎంతో ముఖ్యం. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇతరులను అతిగా విశ్వసించటం వల్ల నష్టపోయే ప్రమాదం ఉంది జాగ్రత్త వహించండి. బంధుమిత్రులతో కీలకమైన విషయాలు చర్చలు జరుపుతారు. ఖర్చులు ప్రయోజనకరం. **తుల** :కొన్ని ముఖ్యమైన విషయాల్లో పట్టువిడుపు ధోరణితో వ్యవహరించటం మంచిది. వైద్యులకు ఒత్తిడి, ఇంజనీరింగ్‌లకు సంతృప్తి, ప్లీడర్లకు చికాకులు తప్పవు. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక వ్యాపారులకు మందకొడిగా ఉంటుంది. పారిశ్రామిక, కార్మిక సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. **వృశ్చికం** : ఉత్తర ప్రత్యుత్తరాలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. వృత్తి, వ్యాపారులకు ఆశించినంతగా పురోభివృద్ధి ఉండదు. ఉద్యోగస్తులు పదోన్నతి కోసం చేసే యత్నాలు కొంతవరకు సఫలం అవుతాయి. ప్రయాణాలు, ఇతర కార్యక్రమాలు వాయిదా పడతాయి. నిరుద్యోగులు ఉద్యోగాలకై చేయు ప్రయత్నాలు ఆశాజనకంగా సాగుతాయి. **ధనుస్సు** : స్త్రీలకు అలం కరణలు, విలాస వస్తువుల మీద మక్కువ పెరుగుతుంది. ఉద్యోగస్తులు తోటివారి నుండి ఆహ్వానాలు అందుకుంటారు. ఒక ముఖ్య విషయమై న్యాయసలహా పొందవలసి వస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి శుభదాయకం. ప్రైవేటు సంస్థల్లోని వారికి ఊహించని మార్పులు సంభవిస్తాయి. ప్రేమికులు శుభవార్తలు వింటారు. **మకరం** :గృహంలో మార్పులు, చేర్పులకై చేయు ప్రయత్నాలు వాయిదా పడతాయి. కుటుంబీకుల ఆరోగ్యంలో శ్రద్ధ వహిస్తారు. ఒక విషయంలో మీ జీవిత భాగస్వామి సలహా పాటించటంవల్ల కలసి రాగలదు. ఉపాధి పథకాల దిశగా నిరుద్యోగుల ఆలోచనలు ఉంటాయి. విదేశీయాన యత్నా లలో ఆటంకాలు తొలగిపోగలవు. పరోపకారానికి పోయి సమస్యలు తెచ్చు కోకండి. **కుంభం** :ఉద్యోగస్తులు అధికారులతో ఏకీభవించలేరు. ఏజెంట్లకు, బ్రోకర్లకు పురోభివృద్ధి. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్ల విషయంలో ప్రతికూలతలు, చికాకులు ఎదురవుతాయి. **మీనం** : మిత్రుల నుండి ఒక ముఖ్య సమాచారం అందు కుంటారు. విద్యార్థినులు పట్టుదలతో శ్రమించిన సత్ఫలితాలు సాధించగలరు. క్రయవిక్రయాలు సామాన్యం. కొత్త కొత్త వ్యాపార రంగాలపట్ల ఆసక్తి పెరుగు తుంది. ముఖ్యుల గురించి ధనం వెచ్చిస్తారు.

# గోవుల్లు తెల్లన.. గోధూళి ఎర్రన..

## సంకీర్తన




**ఆవులోని ఔషధ గుణగణాలు**

అటామిక్ రేడియేషన్ నుంచి రక్షణ పొందగల సర్వాధిక శక్తి ఆవు పాలలో వుందని రష్యా శాస్త్రవేత్త శిరోవిచ్ ఆనాడే గుర్తించాడు. పారవేసిన పదార్థాలు ఆవులు తిన్నప్పటికీ వాటి పాలు స్వచ్ఛమైనవిగా ఉంటాయి.

ఇండ్లల్లో వాకిళ్లను ఆవుపేడతో అలికితే వారు రేడియో ధార్మిక కిరణాల నుంచి సురక్షితంగా ఉంటారు. పాలు తాగితే హృదయ సంబంధరోగాలు దూరమవుతాయి. అదేవిధంగా శరీరంలోని చురుకు దనాన్ని కలిగిస్తాయి. జ్ఞాపకశక్తికి ఆవు శ్రేష్ఠమైనది. ఆవు నెయ్యిని వేడి చేస్తే దానివల్ల వచ్చే పొగ వాతావరణ కాలుష్య రహితం చేస్తుంది. నెయ్యితో యజ్ఞయాగాదులు నిర్వహిస్తే రేడియో ధార్మిక కిరణాల నుంచి రక్షణ అభిస్తుంది. ఆవు దాని సంతతి వినిపించే శబ్దాలతో మానవుల్లోని మానసిక వికారాలు నిర్మూలమవు తాయి. ఆవు పేడలో కలరా వ్యాధిలోని క్రిములను నాశనం చేయగల లక్షణాలు ఉన్నాయని ప్రముఖ వైద్యులు పరిశోధనలో తెలిపారు. క్షయ రోగులను కొద్ది రోజులు గోశాలలో ఉంచితే ఆవు పేడ, ఆవు మూత్రం యొక్క వాసనలకు క్షయ రోగం నాశనమవుతుంది. ఒక తులం నెయ్యితో యజ్ఞం నిర్వహిస్తే ఒక టన్ను ఆక్సిజన్ పెరుగుతుంది.

పశువధశాలల వల్ల భూకంపాలు సంభవిస్తా యని పూర్వీకులు పేర్కొన్నారు.



### జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల నిధులు స్వాహా చేసిన
# పైనంపాడు బ్రాంచి పోస్టుమాస్టారు పై చర్యలు తీసుకోవాలి
### గిరిజన సంఘం నాయకులు దీసరి గంగరాజు

అనంతగిరి : పైనంపాడు పంచాయతీ,. బిపిఎం, (బ్రాంచి పోస్టు మాష్టారు) ఆనంద్ కుమార్ పై చర్య తీసుకోవాలని సిపిఎం నాయకులు మండల పరిషత్ అభివృద్ది అధికారి నగేష్ ను కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు 19-20 సంవత్సరము లలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చేసిన ఎనిమిది గ్రామాలకు చెందిన 160 మంది లబ్ధిదారులకు అందవలసిన సుమారు ఆరు లక్షల రూపాయలు స్వాహా చేశాడని ఆయన పై క్రిమినల్ కేసు నమోదు చెయ్యాలని లబ్ధిదారులకు అందవలసినమొత్తం సొమ్ము పంపిణీ చేయాలని సిపిఎం మాజీ ఎంపీటీసీ డి, గంగరాజు, మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు, మండల కార్యదర్శి, కె మొసియా కోరారు.



పోస్టు మాస్టారు పై చర్యలు తీసుకోవాలని అనంతగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారికి వినతి పత్రం ఇస్తున్న గంగరాజు, మొసియ

### దుర్గాలమ్మ ఆలయంలో
# అలరించిన భక్త రంజనీ కార్యక్రమం



మధురవాడ : మహా విశాఖ జోన్ 1 పరిధి మధురవాడ చంద్రంపాలెం జాతరగట్టు శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ విశాఖపట్నం వారిచే భక్త రంజనీ కార్యక్రమం బుధవారం ఏర్పాటు చేశారు. భగవద్గీత ప్రచారకులు కోట రామకృష్ణ నాయుడు బృందంచే భక్త రంజనీ కార్యక్రమం నిర్వహించారు. భగవద్గీత పారాయణం, దేవి దేవతల భక్తి పాటలు ఆలపించారు. ఇదే ఆలయంలో మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా రేపు కూడా కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా కృష్ణనాయుడు ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు సెక్రటరీ నాగోతి తాతారావు. సభ్యులు పిళ్లా వెంకటరమణ, ఆలయ అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, మూర్తి శర్మ, మరియు సూర్యనారాయణ మాష్టారు, పి. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు

# నేడు లంకెల పాలెంలో జగనన్న విద్యా కానుక పంపిణీ
### వైసీపీ నాయకులు సుందరపు శ్రీనువాసురావు



పరవాడ : జివియంసి 79వ వార్డులో గల లంకెలపాలెంలో హైస్కూల్ లో జగన్ అన్న విద్యాకానుకలు నేడు పంపిణీ చేయబడుతాయని 79వ వార్డు వైసిపి నాయకులు సుందరపు శ్రీనువాసురావు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు అన్నంరెడ్డిఅదీప్ రాజ్ హజరై అయన చేతులు మీదగా పంపిణీ చేస్తామనీ తెలిపారు. ఈకానుకలుపంపిణీ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతము చేయాలని సుందరపు శ్రీనువాస్ కోరారు.

# రైవాడ కు తగ్గని వరద ప్రభావం



### - నీరు విడుదల కొనసాగింపు

దేవరాపల్లి : మండలంలోని రైవాడ జలాశయం నుంచి నీరు విడుదల కొనసాగుతుంది. జలాశయం అత్యధిక నీటిమట్టం 114.00 మీటర్లు కాగా బుధవారం నాటికీ 113.53 మీటర్లకు చేరి ప్రమాదకరంగానే ఉండడంతో శారదా నదిలోకి వరద నీటిని వదులుతున్నారు . ప్రస్తుతం జలాశయంలోకి 3890 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. అయితే ఎడమ కాలువ ద్వారా సాగునీటికి 100 క్యూసెక్కులు, జీవీఎంసీకి 50 క్యూసెక్కులు నీరు విడుదల అవుతుంది. అదే విధంగా జలాశయం మూడు స్పిల్ వే గేట్లు ద్వారా 4633 క్యూసెక్కుల నీరు శారదా నదిలోకి వదులుతున్నట్లు జలాశయం అధికారులు తెలిపారు.

### అంగన్‌వాడీ కేంద్రంలో
# గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు హెచ్‌బి శాతం నిర్ధారణ పరీక్షలు



విశాఖపట్నం : అర్బన్-2 ప్రాజెక్ట్ పరిధిలో గల మద్దిలపాలెం సెక్టార్‌లో గల కెఆర్‌ఎం కాలనీ-1 అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో లత ఆదేశాల మేరకు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్ ఆర్.సుబ్బలక్ష్మి మాట్లాడుతూ గర్భిణీలు మరియు బాలింతలు ఆరోగ్యంగా వుండాలంటే హెచ్‌బి శాతం ఎక్కువగా వుండాలని తెలిపారు. వి.సత్యవేణి సచివాలయం ఎఎన్‌ఎం రక్తపరీక్షలు నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు హెచ్‌బి శాతం నిర్ధారణ పరీక్షలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, తల్లులు, మహిళా పోలీస్ సిహెచ్.అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

### గ్రామీణ వైద్యులకు
# 429 జీవో ప్రకారం తగిన గుర్తింపు కల్పించాలి
### - బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ స్టేట్ ప్రెసిడెంట్ వి.వి.కృష్ణారావు
### - స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పదిలం బెన్నబాబు





రాజమహేంద్రవరం : తూ.గో.జిల్లా రాష్ట్రంలో ప్రాథమిక వైద్య సేవలు అందజేస్తున్న గ్రామీణ వైద్యుల కష్టాలను అప్పటి ముఖ్యమంత్రి కీ.శే.వైయస్.రాజశేఖర్ రెడ్డి 425 జీవో ను పాస్ చేసారు.ఆ జీవో ప్రకారం గ్రామీణ వైద్యులకు కమ్యూనిటీ పారామెడిక్స్ ట్రైనింగ్ ను ఇచ్చారు.అయితే అర్థాంతరంగా ట్రైనింగ్ ను నిలిపివేసారు.అయితే ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి ఎటువంటి అర్హత సర్టిఫికేట్ ఇవ్వకపోవడంతో గ్రామీణ వైద్యుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.అయితే గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న వైయస్.జగన్మోహన్ రెడ్డి పాద యాత్ర సమంలో తన తండ్రి వైయస్.రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన 429 జీవో ప్రకారం గ్రామీణ వైద్యులకు తగిన గుర్తింపును ఇస్తానని చెప్పారని బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వి.కృష్ణారావు, ఉపాధ్యక్షుడు పదిలం.బెన్నబాబు అన్నారు.అయితే ఇచ్చిన మాట నిలబెట్టు కొనే నేతగా పేరు తెచ్చుకొంటున్న ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి 429జీవో ప్రకారం ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి తగిన అర్హత పత్రాలను ఇస్తూ మిగిలిన సభ్యులకు ట్రైనింగ్ ఇస్తూ త్వరలో గ్రామాలలో ప్రారంభించబోయే వైయస్ఆర్ విలేజ్ క్లీనిక్ లలో గ్రామీణ వైద్యులకు తగిన ప్రాధాన్యతను కల్పించివలసినదిగా కోరుచున్నారు.

# మనగ్రామం మనశుభ్రత మన బాధ్యత
### - నేను సైతం అంటూ చీపురు పట్టిన ప్రభుత్వ విప్ బూడి



దేవరాపల్లి : మన గ్రామాన్ని మనమే బాధ్యతగా శుభ్ర పరుచుకొని అందరూ ఆరోగ్యంగా మెలగాలని ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు బూడి ముత్యాలనాయుడు అన్నారు. నేను సైతం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ తమ గ్రామాల పరిశుభ్రత కు కృషి చేయాలని నియోజకవర్గం ప్రజలకు ఆయన పిలుపు నిచ్చారు. మాడుగుల నియోజకవర్గ శాసన సభ్యులు అని మరచి ఒక సామాన్య తారువ గ్రామ పౌరుడిగా గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరిని ఒక దగ్గరకు చేర్చి బుధవారం శ్రమదానంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పులను తొలగించారు. ఆర్ అండ్ బి రోడ్డు గవరవరం నుంచి కాశీపురం రోడ్డు ఉంది. తారువా గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్నటువంటి తుప్పల తొలగించే కార్యక్రమానికి గ్రామంలో అందరినీ కోరగా పార్టీలకతీతంగా అందరూ స్వచ్ఛందంగా పాల్గొన్నారని ఆయన తెలిపారు.

# వెలుగులో సిబ్బంది అక్రమాలపై క్షేత్రస్థాయి విచారణ చేయండి
### సిపిఐ మండల కార్యదర్శి అజయ్‌బాబు



ఏపిఎం మంగతో మాట్లాడుతున్న
నాతవరం సిపిఐ మండల కార్యదర్శి అజయ్‌బాబు

నాతవరం : వెలుగు సిబ్బంది అక్రమాలపై క్షేత్రస్థాయి విచారణ చేయాలని సిపిఐ మండల కార్యదర్శి డొక్కా అజయ్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు కార్యక్రమాలను ఆదాయంగా మార్చుకొని అందినకాడికి దండుకుంటున్నారన్నారు. స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే బ్యాంక్ రుణాలు, వైయస్సార్ ఆసరా పథకాలపై కమీషన్ వసూలు చేస్తూ లక్షలాది రూపాయలు అనధికారికంగా సొమ్ము చేసుకుంటున్నారన్నారు. తాజాగా గ్రూపులో ఆన్‌లైన్ వైయస్సార్ ఆసరా పథకానికి మార్పులు చేర్పులు చేసేందుకు సైతం వసూళ్లు ప్రారంభించారని తెలిపారు. ఒక్కో ప్రాంతానికి స్వల్ప భారీ రుణాలకు ఒక్కో రకంగా రేటు నిర్ణయించి కొన్ని చోట్ల గ్రూపు 1000 నుంచి 2వేల వరకు వసూలు చేస్తున్నారని చెప్పారు. అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని ఆదాయ మార్గంగా మార్చుకుంటున్నారన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు తీవ్ర నష్టం చేకూరుస్తున్నారని చెప్పారు. సంఘాల్లో ఉన్న అమాయకత్వం, అవసరాన్ని ఆసరాగా చేసుకొని దందా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. రుణాలు పొందిన గ్రూపు సభ్యులతో ఉపాధికి సంబంధించిన యూనిట్లు గ్రౌండింగ్ చేయించి క్షేత్రస్థాయిలో వారి ఆర్థిక అభివృద్ధికి చేయూతనివ్వాలే కానీ వారు అదనపు ఆదాయమే ధ్యేయంగా ముందుకు సాగుతుండటం బాధాకరమన్నారు. దీంతో పొదుపు సంఘాల మహిళలు బ్యాంక్ నుంచి తీసుకున్న రుణాలను వ్యక్తిగత అవసరాల వినియోగించుకుంటున్నారన్నారు. మరో వైపు గ్రూపులో ఆన్‌లైన్ పేరుతో పైసలు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. దీంతో ప్రభుత్వ ఆశయం క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదని చెప్పారు. ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు వైయస్సార్ ఆసరా పథకం ఇటీవల అమలు చేసిందని, ఈ అమలు కాలంలో ప్రతీ ఒక గ్రూపును ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో సంఘమిత్ర వెలుగు సిబ్బంది చేతివాటం చూపి పెద్ద మొత్తంలో సభ్యుల నుంచి వసూలు చేస్తున్నారని చెప్పారు. వైయస్సార్ ఆసరా కింద నగదు జమ కానీ సభ్యులు ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నాతవరం మండలంలో 1600 డ్వాక్రా గ్రూపులు ఉండగా 17వేల సభ్యులు ఉన్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన అనంతరం అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని అమలుకు పూర్తిస్థాయిలో నిర్ణయించారన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు వారి రుణాలు పూర్తిగా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరిచే నేపథ్యంలో ఆధార్ బ్యాంక్ ఖాతా నెంబరు వివరాలు వారి సెల్‌ఫోన్ నెంబర్‌తో పాటు బ్యాంకుల్లో తీసుకున్న రుణం వివరాలను సేకరించి వెబ్‌సైట్‌లో నమోదు చేసే ప్రక్రియ కొంత కాలం క్రితం నుంచి జరుగుతుందన్నారు. ఈ వ్యవహారం మొత్తం మండలంలోని సిసిలు, సిఎల పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని అక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇలా మండలంలో కొన్ని చోట్ల నుంచి ఐదు వందల రూపాయల నుంచి వెయ్యి రూపాయల వరకు వసూలు చేస్తుండగా మరికొన్ని చోట్ల సభ్యురాల నుంచి 150 నుచి 100 వరకు సేకరిస్తున్న విషయం మా దృష్టికి వచ్చిందన్నారు. ఈ మొత్తాన్ని వాటాలు వేసుకొని పంచుకున్నట్లు తెలిసిందన్నారు. విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు విఒలకు గ్రామసంఘాల ఆధ్వర్యంలో పని చేసేవారని, వారికి గౌరవ వేతనం లేని సమయంలో సమైక్య సంఘం నుంచి కొంత మొత్తం వేతనంగా అందించేవారన్నారు. అయితే గత ప్రభుత్వం వారి సేవలకు నెలకు 3వేల వేతనం మంజూరుకు నిధులు విడుదల చేసిందని, దీంతో సంఘ సభ్యుల నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయవద్దని స్పష్టం చేసిందన్నారు. కానీ సంఘ మిత్రలు అనేక చోట్ల పాత పద్దతిలోనే వసూలు చేయడం ఏంటని ప్రశ్నించారు. పొదుపు సంఘాలకు ప్రభుత్వం ఏటా వందల కోట్ల రూపాయల బ్యాంక్ లింకేజి రుణాలు ఇస్తుందని, డ్వాక్రా సభ్యులు సంఘాల సమావేశం నిర్వహించుకొని తీర్మానం చేసుకుంటున్నట్లు వెలుగు సిబ్బంది సంతకం చేస్తే బ్యాంకులో రుణం మంజూరు చేసేవని, ఈ అవకాశాన్ని వెలుగు సిబ్బంది ఆదాయ మార్గంగా మార్చుకున్నారన్నారు. లక్షకు వెయ్యి రూపాయల నుంచి 2వేల వరకు కమీషన్ వసూలు చేస్తున్నారన్నారు. ఇలా ఏటా లక్షలాది రూపాయల మహిళల సొమ్మును వెలుగు సిబ్బంది క్షేత్ర స్థాయిలో పని చేసే సిసిలు సంఘమిత్ర దండుకుంటున్నారన్నారు. దీనికి తోడు మండల స్థాయిలో ఆ్యపారస్తులకు ఫైనాన్స్ వడ్డీ వ్యాపారులకు సైతం సభ్యులుగా చేరి లింకేజీ రుణాలు సంఘమిత్రుల ద్వారా పొందుతున్నట్లు తెలిసిందన్నారు. అలాంటి వారి నుంచి అత్యధిక సంఖ్యలో కమిషన్లు పొందుతూ వెలుగు సిబ్బంది జేబులు నింపుకుంటున్నారని చెప్పారు. పంచాయతీ మండల స్థాయిలో ఎక్కువ శాతం మంది వెలుగు ద్వారా వచ్చిన రుణాలను వడ్డీ వ్యాపారులుగా, రోజువారి వ్యాపార ఫైనాన్స్‌లుగా మార్చుకొని లావాదేవీలు కొనసాగిస్తున్నారన్నారు. మరికొన్ని చోట్ల అయితే సంఘ మిత్రులు వెలుగు సిసిలు బినామీ పేర్లతో రుణాలు పొంది ఆ మొత్తంతో వడ్డీలు, ఫైనాన్స్ వ్యాపారాలు సాగిస్తున్నారని ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని బుధవారం నాతవరం ఏపిఎం మంగను కలిసి ఈ అక్రమాలపై వివరించారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సత్యదేవుని నిత్య అన్నదానానికి

## రూ.1,00,000/- విరాళం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్య నారాయణ స్వామివారి దేవస్థానంలో

ఎంతో ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన ప్రసాదమునకు దొడ్డిగుంట గ్రామం, రంగంపేట మండలం వాస్తవ్యులు టి.రామ రాజు, వి.శ్రీమన్నారాయణ రూ.1,00,000/- విరాళమును దేవస్థానం పిఆర్వో కొండలరావు కు అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో సెప్టెంబర్ 16వ తేదీన వి.సూర్యకాంతం పేరున అన్నదానం జరిపించవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా...

దాతలను పిఆర్వో కొండలరావు అభినం దించారు.

### విద్యార్థి యువజన నాయకులను

# అక్రమ అరెస్టు చేయడం తగదు

### ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాధాకృష్ణ

గొలుగొండ : విశాఖపట్నం నగరంలో వేల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కాపాడలేని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రాణాలను కాపాడాలని నిరసన చేస్తున్న విద్యార్థి యువజన సంఘాల నాయకులను అరెస్టు చేయడం తగదని, తక్షణమే విరమించు కోవాలని అఖిల భారత యువ జన సమాఖ్య జిల్లా అధ్యక్షులు జి.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కరోనా వైరస్ విజృం భిస్తున్న నేపథ్యంలో డబ్ల్యూహెచ్ఒ ఎటువంటి పరీక్షలు నిర్వహించరాదని సూచనలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం దీనికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుం దన్నారు. విద్యార్థు లకు కరోనా లక్ష ణాలు కలిగి ఉంటే విద్యా ర్థులు, ఉపాధ్యా యులు లక్షల సంఖ్యలో కోవిడ్ బారిన పడే అవకాశం ఉందన్నారు. కావున విద్యార్థులు, ఉపాధ్యా యుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని తక్షణమపై పై తరగతులకు ప్రమోట్ చేయా లని డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రంగన్న, ఏఐ వైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్య దర్శులు బి.బుజ్జి, గణపతి, జి.ఫణీంద్ర, వి.జ్యోతి, అమర్, చంటి, మధు తదితరులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# కండిపల్లి లో ఉచిత పశు వైద్య శిబిరం



కండేపల్లి లో పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యాధికారులు

చోడవరం : మండలంలోని కండేపల్లి గ్రామంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. చోడవరం వ్యవసాయ మార్కెట్ సౌజన్యంతో స్థానిక పాల కేంద్రం వద్ద పాడి పశు వులకు పశువైద్యం నిర్వహించారు.

చోడవరం పశు వైద్యశాల ఏడి టీ చిన్న నాయుడు, గవరవరం పశువైద్యాధికారి టి ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొని పాడి పశు వులకు వర్షాకాలంలో తరచుగా వచ్చే సీజనల్ వ్యాధులు, పాల దిగుబడి కి తీసుకోవాల్సిన మెలుకువలు తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో...

చోడవరం వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్మన్ జి శంకర్రావు, పీఏసీఎస్ అధ్య క్షులు జానపద సత్యారావు, కార్యదర్శి వి పైడి ఈశ్వరరావు, గోవాడ , బుచ్చయ్యపేట పశు వైద్య అధికారులు శ్రీలత, లక్ష్మి లిఖిత, లైవ్ స్టాక్ అసిస్టెంట్ టి కృష్ణ కుమార్, రైతు భరోసా కేంద్రం ఇంచార్జ్ కె నాగేశ్వరరావు స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

### వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో

# అందరూ అప్రమత్తంగా ఉండాలి

### కొయ్యూరు సిఐ వెంకటరమణ



సిఐ వెంకటరమణ

కొయ్యూరు : వర్షాలు కురవడం వల్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొయ్యూరు సిఐ వెంకటరమణ కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రెండు మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాల వల్ల రైతులకు సంబంధించిన కరెంట్ మోటార్లు నీటిలో మునిగి ఉంటాయన్నారు. స్టార్టర్ డబ్బాలు తడిసి ఉంటాయని, కావున వాటిని ముట్టుకొనే ప్రయత్నం కాని దగ్గరకు వెళ్లే ప్రయత్నం కానీ చేయవద్దన్నారు. అలాగే మీ ఇంటికి సంంధించిన సర్వీస్ వైర్లని కాని వాటితో వేలాడే ఇనుప తీగలను, కరెంట్ స్తంభాలను పట్టుకోవద్దన్నారు. అలాగే తడిచేతులతో ఇంట్లోని స్విచ్ బోర్డులను ముట్టుకోకూడదన్నారు. విద్యుత్ షాక్‌తో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

### ఆమె నృత్యాభినయం ఆదర్శప్రాయం

విశాఖపట్నం : తన నృత్యాభినయంతో దేశ విదేశాల్లో ప్రశంసలు పొందిన పద్మశ్రీ డాక్టర్ శోభా నాయుడు అకాల మరణం బాధాకరమని ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు ఆవేదన వ్యక్తం చేశారు. రవీంద్ర భారతి, తుమ్మలపల్లి కళాక్షేత్రం, కళాభారతి వంటి వేదికలపై పలుమార్లు ఆమె నృత్య ప్రదర్శనలు తిలకించి గొప్ప అవకాశం దక్కిందని గుర్తుచేసుకున్నారు. శోభానాయుడు వంటి ప్రముఖ నర్తకి ఇక లేరన్న వార్త విని తట్టుకోలేక పోయామన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ శోభా నాయుడు మృతికి చెన్నా సంతాపం తెలియజేశారు.

# వరదలో కొట్టుకుపోయిన కాజ్ వే

- 200 గిరిజన గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- అసంపూర్తిగా నిలిచిపోయిన బ్రిడ్జి అవతలకు శవాన్ని మోసుకెళ్తున్న గిరిజనలు





దేవరాపల్లి : దేవరాపల్లి - పినకోట రోడ్డులో శారదా నదిపై నిర్మించిన తాత్కాలిక కాజ్ వే వరదలకు కొట్టుకుపోయింది. దీనితో శారదా నది అవతల ఉన్న సుమారు 200 గిరిజన గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి.గత మూడు రోజులుగా భారీ వర్షాలతో రైవాడ జలాశయం నిండింది. సోమవారం రాత్రి వరద నీటిని జలాశయం అధికారులు విడుదల చేయడంతో తాత్కాలిక కాజ్ వే వరద నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. ఏళ్ళు తరబడి శారదా నది పై శాస్వత బ్రిడ్జిని నిర్మించకుండ అసంపూర్తిగా వదిలి పెట్టడం దేవరాపల్లి, వాలాబు, జీనబాడు, పినకోట, పెదకోట, జాలాడ, కీవర్ల, కుడియా తదితర పంచాయతీ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిత్యవసర వస్తువులు కోసం గిరిజనలు, గర్భిణీ స్త్రీలు, వృద్ధులు బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత అనేక సంవత్సరాలు గిరిజనులు ప్రజలు పోరాట పలితంగా దేవరాపల్లి శారదా నదిపై బ్రిడ్జిని నిర్మించాలని గిరిజనులు సిపిఎం పార్టీ అద్వర్యం లో అనేక పోరాటాలు నిరసనలు పలితంగా సాధించుకున్న బ్రిడ్జికి సుమారుగా 6 కోట్ల రూపాయలు ప్రభుత్వ నిధులు మంజూరు చేసింది. బ్రిడ్జి నిర్మాణం పనులు చేసి కాంట్రాక్టరు అసంపూర్తిగా వదిలివెళ్ళిపోవడం వలన ఈ సమస్య అలాగే మిగిలివుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బుధవారం కోరపర్తి అంగన్వాడీ టీచర్ దేవరాపల్లి లో చనిపోవడంతో తనసోంత ఊరు అయిన జీనబాడు గ్రామానికి తీసుకు వెళ్ళడానికి నది దాటలేక అసంపూర్తిగా నిలిచి పోయిన బ్రిడ్జి పైకి చేతులతో మోసుకోని అవతలవైపుకి తీసుకోని వెళ్ళడానికి నానా అవస్థలు పడ్డారు . ఇది చూసిన వారు అందరూ పాలకులు పనితీరుపై దుమ్మెత్తి పోశారు. నమ్మి ఓట్లు వేసిన పాపానికి ప్రభుత్వం గిరిజనులుకు, పేదలకు తగిన గుణపాఠం చేబుతుందని శాపనార్థాలు పెట్టారు. వెంటనే తాత్కాలిక కాలిబాటను మరమత్తు చేసి, శాశ్వత బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# దుర్గాదేవి పందిరికి శంకుస్థాపన

### ముఖ్య అతిథిగా మాజీ సర్పంచ్ చుక్కా హాజరు



పరవాడ : పరవాడ గ్రామంలో యంగ్ మేన్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న దుర్గా దేవి నవరాత్రులు ఉత్సవాలకు మొదటగా అసోసియేషన్ సభ్యులు వినాయక పూజ చేసారు. అనంతరము దుర్గాదేవి పందిరికి శంకుస్దాపన చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ పెద్దలు, పరవాడ మాజీ సర్పంచ్, యంగ్ మేన్స్ వ్యవస్థాపకులు చుక్క రామునాయుడు హజరైఅయన చేతులు మీదగా కొబ్బరికాయ కొట్టి స్టేజి పనులు ప్రారంభించారు. ఈ సందర్బంగా చుక్క రామునాయుడు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా విజయదశమికి దుర్గా దేవీ నవ రాత్రులు నిర్వహించడం చాలా శుభప్రదం అని అన్నారు. అమ్మవారి దయ వలన మహమ్మారి కరోనా తగ్గి మళ్ళీ మునుపటి రోజులు రావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే తేదీ 17.10.2020 శనివారం ఉదయం శ్రీ దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిపి తేదీ17.10.2020 నుండి విజయదశమి రోజు వరకు అనగా 25.10.2020 వరకూ ప్రతిరోజు అమ్మవారి పూజా కార్యక్రమాలు కోవిడ్ నిబంధ నలుతో నిర్వహించుటకు అసోసియేషన్ కార్యవర్గం నిర్ణయించిందని యంగ్ మేన్స్ అసోసియేషన్ సభ్యులు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పోతల అప్పలనాయుడు, పయిల టివి అప్పారావు,గండి ఈశ్వరరావు, చుక్కా రవి కుమార్,పరవాడ జగదీష్ రావు,ద్వారపూడి శ్రీనివాసరావు,గండి చాంగిరి శ్రీనివాసరావు,పాలు డైరీ ప్రెసిడెంట్ పయిల మురళి, గండి కూర్మారావు,గండి వెంకటరావు, చుక్క నోమో,గండి చంద్రరావు,రాజాన వెంకటరమణ,తేలు రమణాజీ, గండి అప్పలనాయుడు,గండి సన్యాసిరావు,రెడ్డి నారాయణరావు,చుక్క అప్పల నాయుడు, చుక్క గోపి,గండి సురేష్,పయిల రాధాకృష్ణ,గండి రమేష్,కర్రి సంతోష్,ఆడారి అప్పారావు, బండారు సత్యం,వడిసెల సూరిబాబు,బండారు పైడి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అవ్వాతాతలకు పెన్షన్ పెంపు ఎక్కడ..?

### జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త సూర్యచంద్ర



వృద్దులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు సూర్యచంద్ర

నాతవరం : అవ్వా తాతలకు పెంచుతానన్న పింఛన్ల పెంపు ఎక్కడ అని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. నాతవరం మండలం మాధవనగరం గ్రామంలో పలువురు వృద్దులతో కలిసి ఆయన మాట్లాడారు. మాట తప్పం-మడమ తిప్పం అంటూ పెన్షన్ల విషయంలో మాట తప్పారన్నారు. పెన్షన్లు పెంచుతారని అవ్వా తాతలు ఎదురు చూస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఎలక్షన్లకు ముందు మేనిఫెస్టోలో అర్హత ఉన్న ప్రతి అవ్వాతాతలకు మేం అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు వేల రూపాయలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచుకుంటూ పోతామని ఒక సారి మాట మార్చారన్నారు. ప్రతి ఏడాది 250 రూపాయలు పెంచుతామని చెప్పి ఇప్పటికి ఏడాది అయినప్పటికీ పింఛన్ పెంచలేదన్నారు. ఇంటికి వచ్చే వాలంటీర్‌ని బాబు పెన్షన్ పెరిగిందా లేదా అని అడుగుతుంటే లేదనే సమాధానం చెబుతున్నారన్నారు. పెంచిన పిల్లలు ఉపాధి కోసం ఎక్కడెక్కడికో వెళ్లిపోతే వృద్దులు మాత్రం ఉన్న ఊరిలోనే ఉండిపోయి ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ మీదే ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేవన్నారు. ప్రభుత్వం రేషన్ బియ్యం, కందిపప్పు, శెనగలు ఇస్తున్న ఇతర నిత్యావసరాలు, కూరగాయలు, నూనెలు కొనలేని పరిస్థితి వచ్చిందన్నారు. ఒకే ఇంట్లో ఉంటున్న 60 సంవత్సరాల వయస్సు దాటిన ఇద్దరు అవ్వాతాతలకు పెన్షన్ ఇవ్వడం లేదన్నారు. అలాంటి పరిస్థితులలో కనీసం పెన్షన్ పెరిగితే కొంత ఆసరా అయినా లభిస్తుందని వృద్దులు ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో ఏ గ్రామంలోకి వెళ్లిన అవ్వా తాతలు ఇదే ప్రశ్న అడుగుతున్నారన్నారు. దీనిపై తక్షణమే స్పందించి మాట మీద నిలబడాలని డిమాండ్ చేశారు. అలాగే గత ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన గృహ నిర్మాణం తాలూకా పెండింగ్ బిల్లులు ఇప్పటికీ వారి వారి ఖాతాలో జమ కాలేదని, ఈ విషయాన్ని కూడా గుర్తు పెట్టుకోవాలన్నారు. గ్రామాల్లో ఉండే ప్రజలు సంక్షేమ పథకాలే కాకుండా అభివృద్ధి వైపు దృష్టిసారించాలని కోరారు. అన్ని గ్రామాల్లో ఉండే రోడ్లు, వార్డుల్లో రోడ్డు, నర్సీపట్నం మున్సిపాలిటీలో రోడ్డు గుంతలు పడి అధ్వాన్నంగా తయారయ్యాయన్నారు. వాటిని మరమ్మత్తులు చేయడంతో పాటు రోడ్లను వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిల్లాడ రమేష్, అరిగెల రఘు, కూలి శెట్టి నానిబాబు, ప్రసాద్, కోటి, సుంకర ప్రసాద్, నాతవరం మండలం యువ నాయకుడు బైన మురళి, నాతవరం మండలం ప్రధాన కార్యదర్శి పైల వెంకటరమణ, నాతవరం మండలం ఉపాధ్యక్షుడు మంగళ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## నిండా మునిగిన కన్నంపాలెం, చాకిపల్లి పంటపొలాలు, జలదిగ్బంధంలో 600 ఎకరాల పంట



చోడవరం : గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని కన్నం పాలెం, చాకిపల్లి గ్రామాల్లో పంట పొలాలు పూర్తిగా నీటమునిగాయి. ఎగువ నుంచి భారీగా వస్తున్న నీరుతో పంట పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. జన్నవరం నుంచి చాకిపల్లి గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న వరి, చెరకు వంటలు సుమారు 600 ఎకరాల వరకు నీటమునిగాయి. దీంతో ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

# ‘అవర్ నైబర్ హుడ్ హీరో’ పేరున కోవిడ్-19 ఫ్రంట్ వారియర్స్ గా విధులలో ప్రజలకు సేవ చేసిన పోలీసులకు ఘన సత్కారం



విశాఖసిటీ : ‘అవర్ నైబర్ హుడ్ హీరో’ పేరున కోవిడ్-19 ఫ్రంట్ వారియర్స్ గా ఉంటూ విధులలో ప్రజలకు సేవ చేసిన పోలీసు వారిని సత్కరించే కార్యక్రమములో భాగంగా హెచ్.డి.ఎఫ్.సి బ్యాంకు అధికారులు విశాఖ రేంజ్ డి.ఐ.జి, శ్రీ ఎల్.కె.వి.రంగారావు ఐపీఎస్ డిఐజి విశాఖపట్నం రేంజ్ వారిని తన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి గౌరవించారు.

ఈ సంధర్భంగా డి.ఐ.జి., మాట్లాడుతూ విశాఖ, విజయనగరం మరియు శ్రీకాకుళం జిల్లా లో క్రింది స్థాయి నుంచి ఎపి., స్థాయివరకు ప్రతి పోలీసు అధికారి తమ విధులను విజయవంతంగా నిర్వ హించారన్నారు. కేంద్ర, రాష్ట్ర సూచనలు సలహాలను ఎప్పటి కప్పుడు ప్రజలకు తెలియజేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ తాము ఉన్న మనే భరోసాను కల్పించారన్నారు. ‘‘అవర్ నైబర్ హుడ్ హీరో’’ పేరు ప్రతి పోలీసుకు వర్తిస్తుందని ఉద్ఘాటించారు. హెచ్.డి.ఎఫ్.సి బ్యాంకు అధికారులు ఇలాంటి కార్యక్రమము దేశ వ్యాప్తంగా చేయడం అభినందనీయమని రేంజ్ డి.ఐ.జి., అన్నారు. ఈ కార్యక్రమములో...

సందీప్ పట్నాయక్. డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ - శ్రీనివాస్ బ్రాంచ్ మేనేజర్, శ్రీదేవి బిజినెస్ మేనేజర్, అవినాష్ మొదలైన హెచ్.డి.ఎఫ్.సి బ్యాంకు అధికారులు పాల్గొన్నారు

## గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ
# షుగర్ కేన్ కమిషనర్ కు వినతి

చోడవరం : చోడవరం చక్కెర కర్మాగారంలో ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న చలం పరిష్కరించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ షుగర్ కేన్ కమిషనర్ కు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ (గుర్తింపు) యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, శరగడం రాము నాయుడు, రాయి సూరిబాబు వినతి పత్రం అందజేశారు. విజయవాడలో బుధవారం కేన్ కమిషనర్ ని కలిసి తమ సమస్యలను వివరించారు. ముఖ్యంగా పర్మినెంట్ వెజ్ రివిజన్ చేయాలని, ఎన్ ఎమ్ ఆర్ కొచూరి పేమెంట్ కార్మికులను ఆఫీస్ ఎట్ అలవెన్సులు పెంచాలని, ఇతర దీర్ఘకాలిక సమస్యలు తక్షణం పరిష్కరించాలంటూ ఈ సందర్భంగా కోరినట్లు యూనియన్ నాయకులు శరగడం రాము నాయుడు తెలిపారు.

## తైడా, చిమిడిపల్లి మధ్య
# విరిగిపడిన కొండచరియలు



అనంతగిరి : మన్యంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొత్తవలస కిరండల్ కేకే లైన్ లో చిమిడిపల్లి రైల్వే స్టేషన్ మధ్య 65/28 కిలోమీటర్ వద్ద మంగళవారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడ్డాయి దీంతో కేకే లైన్ రాకపోకలు నిలిచిపోయాయి విషయం తెలుసు కున్న రైల్వేశాఖ ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకొని రైల్వే ట్రాక్ పైన పడిన కొండచరియలు తొలగించే కార్యక్రమం చేపట్టారు.

## గ్రామాల్లో ముమ్మరంగా
# విటమిన్ ‘ఎ’ కార్యక్రమం



గజపతినగరంలో చిన్నారులకు విటమిన్ ఏ పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

చోడవరం : మండలంలోని పలు గ్రామాల్లో 0 నుండి ఐదేళ్లలోపు చిన్నారులకు రూపొందించిన విటమిన్ ‘ఏ’ కార్యక్రమం ముమ్మ రంగా సాగుతోంది. గవరవరం పి హెచ్ సి వైద్యాధికారి దమయంతి దేవి ఆదేశాల మేరకు ఆయా గ్రామా లకు చెందిన ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి చిన్నారులకు విటమిన్ డి ఏ మందును పంపిణీ చేస్తున్నారు. గజపతి నగరం గ్రామంలో ఏఎన్ఎం ఆర్ నూకరత్నం, ఆశా వర్కర్లు లీల, సంధ్య తదితరులు పాల్గొని విటమిన్ ఏ కార్యక్రమం చేపట్టారు.



ఏజెన్సీలో కురుస్తున్న భారీ వర్షాలకురోడ్డుపై పడిన చెట్లను అనంతగిరి యస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో తొలగింపు కార్యక్రమం

# చోడవరం దుడ్డు వీధిలో చోరీ
## పోలీసుల దర్యాప్తు

చోడవరం : చోడవరం పట్టణంలోని దుడ్డు వీధిలో వి సత్యనారాయణ కు చెందిన ఇంటిలో చోరీ జరిగినట్లు చోడవరం పోలీసులకు బుధవారం సమాచారం అందింది. ఈ చోరీలో సుమారు మూడు లక్షల రూపాయల నగదు, 8 తులాల బంగారం అపహరణకు గురైనట్టు తెలిసింది. సత్యనారాయణ తమ కుటుంబ సభ్యులకు అనారోగ్యంగా ఉండటంతో గత వారం రోజులుగా ఆసుపత్రి వద్ద ఉంటున్నారు. ఇంటిలో పెంపుడు కుక్క కు ప్రతిరోజు భోజనం పెడుతున్న వ్యక్తి బుధవారం మధ్యాహ్న సమయంలో ఇంటి తలుపులు తీసి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించారు.

దీంతో ఎస్ ఐ విభూషణ రావు సిబ్బందితో కలిసి చేరుకొని దర్యాప్తు చేపడుతున్నారు. కుటుంబ సభ్యులు వచ్చిన అనంతరం పూర్తి వివరాలు తెలియనున్నాయి.

# నటరాజ సన్నిధికి కూచిపూడి నాట్య కళాకారిణి డా.కట్టా శోభానాయుడు
## విశాఖతో డా.శోభానాయుడుకి ఎనలేని అనుబంధం

నవరస నాట్య కళానిధి పద్మశ్రీ డాక్టర్ కట్టా శోభా నాయుడు ఆ నటరాజ స్వామి పాదాల చెంతకు చేరారు ! న్యూరోలజి సమస్య తో స్టార్ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ రాత్రి 1.44 లకు కన్ను మూశారు! కూచిపూడి నాట్యం ను తన ప్రదర్శనలతో విశ్వ వ్యాప్తం చేసిన ఘనత శోభారాణిదే ! దేశ విదేశాల్లో వేల మంది విద్యార్థులను కూచిపూడి నాట్య కళాకారులు గా, ఉపాధ్యాయులు గా తీర్చి దిద్దిన ఘనత శోభా నాయుడుదే ! 118 కు పైగా ఏకాంకిక అంశాలు కొరియోగ్రఫీల సృష్టికర్త! కూచిపూడి నృత్య రూపకాల ను సురభి వారి సాంకేతికతను ఉపయోగించుకుని సాధారణ ప్రేక్షకులు మన్ననలను కూడ పొందారు ! పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ పురస్కారం, విశాఖపట్నం నటరాజ్ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ద్వారా నాట్యశ్రీ, నవరస నాట్య కళానిధి అవార్డు లను పొందటమే కాకుండా గుర్రపు రథము పై విశాఖ ఊరేగించడం, పల్లకి లో వేదిక వరకు తీసుకొని వెళ్లడం వంటి అద్భుత ఘట్టాలు కూచిపూడి కళారంగం లో మరియు ఏ ఇతర కళాకారులూ కు జరగలేదు. నృత్య చూడామణి, ప్రతిష్టాత్మక ఎన్టీఆర్ పురస్కారం తో పాటు అనేక పురస్కారాలు ఆమెను వరించాయి! ఏ పాత్రలోనైనా ఒదిగి ఆ పాత్రకు వన్నె తెచ్చే ప్రత్యేకత తో కూచిపూడి కళారంగంలో ఓ కలికితురాయి , వేదిక పై ఎలా ప్రదర్శించాలో భరతముని నాట్యశాస్త్రం లో తెలియచేసిన విధంగా ప్రదర్శించ గల శక్తి వున్న ఏకైక కూచిపూడి సాంప్రదాయ నర్తకీమణి శోభానాయుడు ! హైదరాబాద్ దోమలగూడా లో కూచిపూడి ఆర్ట్ అకాడమీ స్థాపించి వేల మంది కి కూచిపూడి నాట్యం లో తర్ఫీదు అందించిన మహనీయురాలు శోభానాయుడు.

అత్యద్భుతంగా ప్రదర్శించిన నాట్య మయూరి. గురు వెంపటి దర్శకత్వంలో శ్రీనివాస కళ్యాణం నృత్య రూపకం లో లో పద్మావతీ పాత్ర తో విశ్వవ్యాప్తంగా కూచిపూడి కళ కు పేరు తెచ్చిన అద్వితీయ నాట్య కళాకారిణి.

కూచిపూడి నాట్యం కోసమే జన్మించిన కారణ జన్మురాలు! తుదిశ్వాస విడిచే వరకు కూచిపూడి నాట్యమే ప్రాణంగా భావించిన కళాకారిణి ఇంత తొందరగా ఆ నటరాజ సన్నిధికి వెళ్లిపోవడం తీవ్ర దిగ్భ్రాంతి ని కలిగిస్తోంది! కుటుంబ సభ్యులకు, శిష్యులకు, ప్రగాఢ సానుభూతి?

డాక్టర్ శోభా నాయుడు గారి తో 15 సంవత్సరాలనుండి అనుబంధం! స్నేహానికి విలువ ఇస్తారు! ప్రేమ గా పలకరిస్తారు! నాట్యం కోసమే జన్మించి ఉంటారనేది ఆమె నమ్మకం! అందుకే ఎంతమంది పెద్ద దర్శకులు సినిమాలలో నటించమని అడిగిన తిరస్కరించి న మృధుస్వభావి ! అంకిత భావం తోనే చివరి వరకు నాట్యమే శ్వాసగా నాట్యమే ధ్యాసగా జీవించారు! దేశ విదేశాలలో ప్రదర్శనలు ఇస్తూ, నాట్య కళను బోధిస్తు గుర్తింపు పొందిన అనేక ప్రముఖ నర్తకీమణుల్లో చాలా మంది ఆమె శిషులే. ఆమె తన అక్క కూతురు ను దత్తత తీసుకొని శివరంజని గా నామకరణం చేసి తన పరంపరను కొనసాగిస్తూ, తన లాగా తన కూతురు శివరంజని కూడా అద్భుత కూచిపూడి కళాకారిణి గా పేరు తెచ్చుకోవాలని ఆమె కోరిక.



(ఫైల్ ఫోటో)



(ఫైల్ ఫోటో)

***విశాఖతో అనుబంధం :***

*శోభానాయుడు కాళ్లకు గజ్జెలు కట్టినప్పుడు నుండి విశాఖ లో ఎన్నో ప్రదర్శన లు ఇచ్చినా, 2006 లో ఆంధ్రవిశ్వకళాపరిషత్ డాన్స్ విభాగంలో ఒక జాతీయ సెమినార్ లో పాల్గొనడం.... ఆ సెమినార్ కి నేను ముఖ్య ఆర్గనైజర్ గా ఉండడం నా అదృష్టం. ఆ నాడు ఆమె తో ఏర్పడిన పరిచయం ప్రతీ సంవత్సరం విశాఖ లో జరిగే నృత్యోత్సవాలలో పాల్గొనడం ఆనవాయితీగా మారిపోయింది.*

*2013 మే లో నటరాజ్ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ద్వారా శోభానాయుడు గారిని విశాఖ లో గుర్రపు బండిపై ఊరేగించి, కళాభారతి ఆడిటోరియం లోకి పల్లకి లో తీసుకొని వెళ్లడం భారత శాస్త్రీయ కళా రంగంలో ఒక సువర్ణ అధ్యాయం.*

*ఆ నాడు పాద పుష్పాభిషేకం తో “ నవరస నాట్య కళా నిధి “ బిరుదుతో సత్కరించిడం ఓ అదృష్టం.*



(ఫైల్ ఫోటో)

ఇటువంటి అద్భుత నాట్యశిరోమణి ని కరోనా బలి తీసుకోవడం విచారకరం కూచిపూడి కళా రంగానికి దురదృష్టకరం! తన భర్త అర్జునరావు రిటైర్డ్, ఐఎఎస్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లో చీఫ్ సెక్రటరీ గా పని చేశారు! కూచిపూడి వైతాళికుడు పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన సత్యం ప్రియ శిష్యురాలు గా శోభానాయుడు ప్రపంచ వ్యాప్తంగా వేలాది ప్రదర్శనలు ఇచ్చి కూచిపూడి నాట్యానికి ఆడపడుచు గా కీర్తి ని పొందారు !

శోభానాయుడు ఒక అద్భుతం.తన పద, పాద విన్యాసంతో,నవరస మిళిత హావ భావాలతో, అందంతో ఎంతో మంది హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించు కున్నారు. తన జీవితాన్ని నాట్య కళకే అంకితం చేసిన గొప్ప వ్యక్తి . పాత్రకి తగ్గ వేషధారణతో, అభినయంతో సత్య భామ గా, దేవదాసిగా, చండాలిక గా తన నాట్య కౌసల్యాన్ని

శోభానాయుడు అంటే కూచిపూడి! ఎందరో కూచిపూడి కళాకారులూ ఉన్నప్పటికీ శోభా నాయుడు ముద్ర భారత శాస్త్రీయ నృత్య రంగానికి చెదరని ముద్ర ! పంచభూతాల సాక్షి గా కూచిపూడి నాట్యం ఉన్నంత కాలం ఆమె పేరు అజరామరం !

# రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

శ్రీకాకుళం : వర్షాలు, వరదలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన క్రిష్ణదాస్ అన్నారు. బుధ వారం రాష్ట్ర ముఖ్య మంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి వరదలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పాల్గొన్న ఉప ముఖ్య మంత్రి మీడియాతో మాట్లాడుతూ వర్షాలు, వరదలపట్ల రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అప్రమత్తంగా ఉందన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలు వచ్చిన వెంటనే జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేసామని ఆయన పేర్కొన్నారు. తద్వారా అధిక నష్టం సంభవించలేదని ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సును నిర్వహించి వరదల పరిస్థితిని సమీక్షించారని పేర్కొంటూ నివేదికలను త్వరితగతిన సమర్పించాలని ఆదేశించినట్లు చెప్పారు. వరదలలో దురదృష్టవశాత్తు రాష్ట్రంలో 10 మంది ప్రాణాలు కోల్పోయారని, అందులో శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలానికి చెందిన ఒక వ్యక్తి ఉన్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎవరూ ఇబ్బందులకు గురికారదనే ఉద్దేశ్యంతో అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. మృతి చెందిన వారి కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని ముఖ్య మంత్రి ఆదేశించారని ఆయన చెప్పారు. వరదల అనంతరం ఎక్కడా పారిశుధ్య సమస్య, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఉప ముఖ్య మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ, ఆర్ అండ్ బి రహదారులు కొన్ని దెబ్బతిన్నాయని, వాటిని తక్షణం పునరుద్ధరణకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్లను ఆదేశించడం జరిగిందని క్రిష్ణదాస్ చెప్పారు. పంటల నష్టంపై రెండు, మూడు రోజుల్లో పూర్తి స్థాయి నివేదికలు సమర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. వరద నీటిని భవిష్యత్తు అవసరాలకు వినియోగించే విధంగా చెరువులు నింపుటకు గల అవకాశాలను పరిశీలించాలని ముఖ్య మంత్రి సూచనల చేసారని తెలిపారు.




### మాస్కు రక్షణ కవచం

ప్రతి ఒక్కరూ మాస్కు ధరించి కరోనా వైరస్ నుండి రక్షణ పొందాలని ఉప ముఖ్య మంత్రి క్రిష్ణదాస్ పిలుపునిచ్చారు.

మాస్కు వైరస్ కు రక్షణ కవచంగా ఉపయోగపడుతుందని అన్నారు. మాస్కు లేకుండా బయటకు వెళ్ళరాదని ఆయన విజ్ఞప్తి చేసారు. కేరళ వంటి రాష్ట్రాల్లో కరోనా వైరస్ రెండవ దశ ప్రారంభం అయినట్లు వచ్చిన వార్తల పట్ల ఉప ముఖ్యమంత్రి స్పందిస్తూ ప్రజలకు మాస్కు సందేశాన్ని అందించారు.

ప్రతి ఒక్కరూ భౌతిక దూరం పాటించాలని, మాస్కు ధరించాలని కోరారు



## భారీ వర్షాలపై ఉప రాష్ట్రపతి ఆందోళన



న్యూఢిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలపై ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు బుధవారం స్పందించారు. వర్షాల కారణంగా ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులపై ఆందోళన వ్యక్తం చేశారు. భారీ వర్షపాతం నమోదవటం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లిన వారికి సానుభూతి ప్రకటించారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలందరూ అధికారుల సూచనలు పాటిస్తూ సురక్షితంగా ఉండాలని ట్విటర్ వేదికగా ఆయన కోరారు.

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ నాలుగు రాష్ట్రాలు అతలాకుతలం అవుతున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాలు నీట మునిగాయి. వందల మంది ముంపులో చిక్కుకున్నారు. పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.

## తుఫాన్ ప్రభావం వలన జివిఎంసికి 15 కోట్లు నష్టం

విశాఖపట్నం : తుఫాన్ ప్రభావం వలన జివిఎంసి పరిధిలో అన్ని జోనులకు సంబందంచి వివిధ జోనల్ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం, మొత్తం 111 పనులకు 1502.84లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు వెంకటేశ్వరరావు తెలిపారు. జివిఎంసి పరిధిలో అన్ని జోన్లలో రోడ్లు, కాలువలు, ఎలక్ట్రికల్, త్రాగునీరు, ఉద్యానవనం మొదలైన వ్యవస్థలు పాడయ్యాయని ప్రధాన ఇంజనీరు తెలుపుతూ ఒకటవ జోనులో 222.00లక్షలు, రెండవ జోనులో 267.33లక్షలు, నాల్గవ జోనులో 276.55లక్షలు, అయిదవ జోనులో 275.00లక్షలు, అనకాపల్లి జోనులో 131.96లక్షలు, భీమిలి జోనులో 158.00లక్షలు కాగా, పి.ఎల్.బీసి. విభాగమునకు 22.00లక్షలు, ఎలక్ట్రికల్ విభాగమునకు 4.00లక్షలు, నీటి సరఫరా భూగర్భడ్రైనేజ్ విభాగమునకు 146.00లక్షల రూపాయలు అంచనా వేయడం అయినదని ప్రధాన ఇంజనీరు ఒక ప్రకటనలో తెలిపారు.

## ముగిసిన షోడశదిన సుందరకాండ దీక్ష

తిరుమల : లోక సంక్షేమం కోసం కరోనా వ్యాప్తిని అరికట్టాలని శ్రీవారిని ప్రార్థిస్తూ టీటీడీ చేపట్టిన షోడశదిన సుందరకాండ దీక్ష నేటితో ముగిసింది. తిరుమలలోని వసంత మండపంలో సెప్టెంబరు 29న ఈ దీక్ష ప్రారంభమైంది. "రాఘవో విజయం దద్యాన్మమ సీతా పతిఃప్రభుః " అనే మహామంత్రం ప్రకారం సుందరకాండలోని మొత్తం 68 సర్గల్లో గల 2,821 శ్లోకాలను 16 మంది సుందరకాండ ఉపాసకులు 16 రోజుల పాటు అత్యంత దీక్షాశ్రద్ధలతో పారాయణం చేసారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల కోసం ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుండి ఒక గంట పాటు ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేసింది.

వసంత మండపంలో శ్లోక పారాయణంతో పాటు ధర్మగిరి వేద పాఠశాలలో మరో 16 మంది ఉపాసకులు 16 రోజుల పాటు జప, హోమ కార్యక్రమాలు నిర్వహించి,నేడు పూర్ణాహుతి నిర్వహించారు.

నూతనంగా భాధ్యతలు చేపట్టిన టీటీడీ ఈవో జవహర్ రెడ్డి ఈ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీక్షలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. మహా సంకల్పంతో దీక్ష చేపట్టిన అదనపు ఈవో ధర్మారెడ్డిని అభినందిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమ నిర్వహణకు విరాళాలు అందించిన దాతలకు జవహర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

దేవదేవుని ఆశీస్సులతో కరోనా మహమ్మారి పూర్తిగా అంతం అవుతుందని భావిస్తున్నానని పేర్కొన్నారు.

## ఏపీలో కరోనా.. కొత్తగా 3,892 కేసులు

అమరావతి: ఏపీలో కరోనా కేసుల తగ్గుముఖం కొనసాగుతోంది. ఒక్కరోజు వ్యవధిలో 69,463 నమూనాలను పరీక్షించగా 3,892 మందికి కరోనా నిర్ధారణ అయినట్లు వైద్యఆరోగ్యశాఖ వెల్లడించింది. దీంతో రాష్ట్రంలో నమోదైన కొవిడ్ కేసుల సంఖ్య 7,67,465కి చేరింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం బులెటిన్ విడుదల చేసింది. 24 గంటల వ్యవధిలో కరోనాతో చికిత్స పొందుతూ 28 మంది మృతిచెందారు. చిత్తూరు, కృష్ణా, విశాఖపట్నం జిల్లాల్లో నలుగురు చొప్పున.. తూర్పుగోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ముగ్గురేసి మరణించారు. అనంతపురం, శ్రీకాకుళంలో ఇద్దరు చొప్పున మృతిచెందగా.. కర్నూలు, విజయనగరం, పశ్చిమగోదావరిలో ఒక్కొక్కరు మరణించారు. దీంతో రాష్ట్రంలో కరోనాతో మృతిచెందిన వారి సంఖ్య 6,319కి చేరింది. 24 గంటల వ్యవధిలో 5,050 మంది కొవిడ్ నుంచి పూర్తిగా కోలుకోగా 41,669 యాక్టివ్ కేసులున్నాయి. ఇప్పటివరకు రాష్ట్రంలో 67,72,273 నమూనాలను పరీక్షించినట్లు బులెటిన్‌లో పేర్కొన్నారు.

# ఏపీ విద్యా విధానంలో విప్లవాత్మకమైన మార్పు

- నాడు నేడు ద్వారా విద్యాలయాలు పూర్తిస్థాయి అభివృద్ధి
- విద్య ద్వారానే కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతాయి
- విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేసిన కె.కె.రాజు

సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గం 24వార్డు సీతమ్మ దార పీ&టీ కోలనీ ఎన్ ఎమ్ సీ హెచ్ స్కూల్లో జగనన్న విద్యా కానుక కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు పాల్గొని వారి చేతులు మీదుగా విద్యార్థులుకు జగనన్న విద్యా కానుక కిట్లును అందజేశారు. ఈ సందర్బంగా కె.కె రాజు మాట్లాడుతూ ఇప్పటి వరకు దేశంలో ఎక్కడా లేని విదంగా 1నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లును పంపిణీ చేస్తున్నారని అన్నారు. ఎన్నో విప్లవాత్మకమైన మార్పులతో నాడు నేడు కార్యక్రమంతో విద్యాలయాలు అభివృద్ధి చేస్తున్నారని ప్రతి ఒక్కరు విద్యావంతులు అయితే ఆర్థిక పరంగా అభివృద్ధి చెంది కుటుంబ పరంగా ప్రతి ఒక్కరు బాగుంటారని అన్నారు. ఏ ప్రభుత్వాలు చేయని విదంగా గౌరవ ముఖ్యమంత్రి వర్యులు వై.యస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు, మరియు 24 వార్డ్ నాయకులు పాల్గొన్నారు





## కోవిడ్ నిబంధనలను అనుసరిస్తూ సినిమా థియేటర్లు తెరవాలి

### సంయుక్త కలెక్టరు ఎం.వేణుగోపాల్ రెడ్డి

విశాఖపట్నం : ఈ నెల 15 వ తేదీ నుండి సినిమా దియేటర్లను తెరవటానికి ప్రభుత్వం అనుతించిన నేపద్యంలో కోవిడ్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని సంయుక్త కలక్టరు ఎం. వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం కలక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సినిమా దియేటర్ల యాజమాన్యం, ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా దియేటర్లలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ చిత్ర ప్రదర్శనలు చేయాలన్నారు. ప్రేక్షకులు తప్పని సరిగా మాస్కు ధరించాలని, సామాజిక దూరం పాటించాలని, దియేటరులోనికి ప్రవేశ, నిష్క్రమ సమయాలలో శానిటైజరుతో చేతులు శుభ్రపరచుకోవాలన్నారు. 10 సంవత్సరాల లోపు, 65 సంవత్సరాలు పైబడినవారికి దియేటర్లలోకి అనుమతి లేదన్నారు. ప్రవేశ ద్వారం వద్ద థర్మల్ స్క్రీనింగు తప్పక చేయాలన్నారు. 50 శాతం సీట్లకు మాత్రమే టిక్కెట్లు జారీ చేయాలని, సాధ్యమైనంత వరకు డిజిటల్ టిక్కెట్స్ జారీచేయాలని తెలిపారు. దియేటర్లలో ఎ.సి. 24 నుండి 30 సెంటీగ్రేడ్ మధ్యలో మాత్రమే ఉంచాలని, ప్యాక్ చేసిన తినుబండారాలను మాత్రమే అమ్మాలన్నారు. దియేటర్ల ప్రతినిధులు మట్లాడుతూ ప్రస్తుతం అన్ని దియేటర్లు తెరుచుటకు సిద్దంగా లేవని, అంచెల వారీగా తెరుస్తామని తెలిపారు. ఎలక్ట్రికల్ చార్జీలు, మున్సిపల్ పన్నులు భారంగా ఉన్నాయని వాటి మాఫీకిగాని, తగ్గించుటకుగాని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. రేపటి నుండి ఐనాక్స్ వరుణ్ బీచ్, మధురవాడ శ్రీకన్య సినీపోలీస్ దియేటర్లు తెరుస్తున్నట్లు దియేటర్ల ప్రతినిధులు తెలిపారు.



## తలసరి జీడీపీలో బంగ్లాదేశ్ దిగువకు భారత్!

దిల్లీ : తలసరి స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) పరంగా ఈ ఏడాది భారత్‌ను బంగ్లాదేశ్ దాటనుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) షాకింగ్ వివరాలు వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 10.3 శాతం కుచించుకుపోనుందని తెలిపింది. 'వరల్డ్ ఎకనామిక్ అవుట్ లుక్' పేరుతో మంగళవారం ఐఎంఎఫ్ ఈ నివేదికను విడుదల చేసింది.

2021 మార్చి 31తో ముగియనున్న ఆర్థిక సంవత్సరానికి భారత తలసరి స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) 10.3 శాతం తగ్గి 1,877 డాలర్లకు చేరుకోనుందని ఐఎంఎఫ్ తన నివేదికలో వెల్లడించింది. అదే సమయంలో బంగ్లాదేశ్ తలసరి జీడీపీ 1,888 డాలర్లకు పెరుగుతుందని ఆ నివేదిక పేర్కొనడం గమనార్హం. 2020 ఆర్థిక సంవత్సరానికి దేశ వృద్ధి రేటు 4.5 శాతం తగ్గిపోనుందని జూన్‌లో వెలువరించిన అంచనాల్లో పేర్కొనగా.. తాజాగా దాన్ని మరింత తగ్గించింది. అయితే, ఆసియాలో మూడో ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ 2021లో 8.8 శాతం వృద్ధిరేటుతో తిరిగి పుంజుకోనుందని, వేగంగా అభివృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థగా తన స్థానాన్ని తిరిగి పొందనుందని తెలిపింది.

అంతేకాకుండా చైనా వృద్ధి రేటు (8.2 శాతం) అంచనాను అధిగమించగలదని ఐఎంఎఫ్ అభిప్రాయపడింది. మరోవైపు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా 4.4 శాతం క్షీణించి.. తిరిగి 2021లో 5.2 శాతానికి పుంజుకోనుందని అంచనా వేసింది. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు సమావేశం కావడానికి ముందు ఈ నివేదిక విడుదలైంది. భారత ఆర్థిక వ్యవస్థ స్థితిపై ఐఎంఎఫ్ అంచనాలను విడుదల చేయగానే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్రంపై తనదైన శైలిలో విమర్శలు చేశారు. 'భాజపా ఆరు సంవత్సరాల విద్వేష జాతీయవాదానికి లభించిన ఘన విజయం ఇది. భారతదేశాన్ని బంగ్లాదేశ్ దాటనుంది' అని ఎద్దేవా చేస్తూ ట్వీట్ చేశారు.

## దుర్గగుడి అధికారుల అత్యవసర సమావేశం

విజయవాడ: తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానది వరద ఉధృతికి ప్రకాశం బ్యారెజ్ వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నట్లు విపత్తు శాఖ కమిషనర్ కె కన్నబాబు తెలిపారు. బుధవాంర ఆయన మీడియాతో మాట్లాడుతూ... మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రకాశం బ్యారేజ్ ఇన్ ఫ్లో, వుట్ ఫ్లో 7,20,701 లక్షల క్యుసెక్కులుగా నమోదైనట్లు చెప్పారు. అలాగే వంశధార నదికి కూడా వరద ఉధృతి పెరుగుతోందని, దీంతో గొట్టా బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం బ్యారెజ్ ఇన్ ఫ్లో 42,980 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 42,916 క్యూసెక్కులు నమోదైందని తెలిపారు. ఇక ముంపు ప్రాంతాల్లోకి వరద ప్రవాహం చేరుతున్నప్పుడు ముందస్తు పునరావాస కేంద్రాలను వెళ్లాలని, లోతట్టు ప్రాంత, లంక గ్రామాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని కన్నబాబు విజ్ఞప్తి చేశారు.

### కీసర మాజీ తహశీల్దార్ నాగరాజు ఆత్మహత్య

హైదరాబాద్ : అవినీతి, లంచం కేసులో విచారణ ఎదుర్కొంటున్న కీసర మాజీ తహసీల్దార్ నాగరాజు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ కేసులో రిమాండ్ ఖైదీగా చంచల్‌గూడ జైల్లో నాగరాజు ఉంటున్నాడు. నాగరాజు మృతదేహాన్ని చంచల్‌గూడ జైలు నుంచి ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

ల్యాండ్ సెటిల్‌మెంట్ కేసులో కోటి పది లక్షల రూపాయాలు లంచం డిమాండ్ చేసిన ఆయన ఏసీబీకి అడ్డంగా చిక్కిన విషయం తెలిసిందే. ఈ కేసులో భారీ మొత్తంలో నగదు, స్థిరాస్తి పత్రాలు, బంగారం లభించడంతో ఆయనను అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com